www.prajanaava.in
Telugu Daily

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 8 | వెల రూ.5.00

Published from: Karimnagar, Circulated to : Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar

హైదరాబాద్ | సంపుటి : 02 సంచిక : 217 | ఆదివారం | 19 జనవరి, 2025


ప్రజానావ ప్రతి అక్షరం జనం కోసం..
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న
ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
: 99484 33277 / 7288825681



## 65 లక్షల మందికి ఆస్తిహక్కు కార్డులు

- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పంపిణీ
- ఆస్తి హక్కులతో భరోసా వస్తుందన్న ప్రధాని మోడీ

02



తెలంగాణలో పెట్టుబడులకు

# సింగపూర్ సుముఖం

## తెలంగాణ సుస్థిర ప్రణాళికపై ఆసక్తి

### సింగపూర్ మంత్రి గ్రేస్ ఫు హైయిన్ సీఎం రేవంత్‌భేటీ

- ఉమ్మడి ప్రాజెక్టుల అధ్యయన బృందాలు గుర్తించాలని నిర్ణయం
- రైజింగ్ తెలంగాణలో భాగస్వామ్యానికి ఆహ్వానం

**ప్రజానావ, హైదరాబాద్ బ్యూరో:** సింగపూర్‌లో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం సింగపూర్ వాణిజ్య, పర్యావరణ మంత్రి గ్రేస్ ఫు హైయిన్‌తో భేటీ అయింది. తెలంగాణతో వివిధ రంగాలలో సింగపూర్ ప్రభుత్వ భాగస్వామ్యంపై ఈ సందర్భంగా చర్చలు జరిపారు. ముఖ్యమంత్రితో పాటు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు, ఉన్నతాధికారులు ఈ చర్చల్లో పాల్గొన్నారు. తెలంగాణకు పెట్టుబడులకు ఉన్న అపారమైన అవకాశాలను వివరించారు. ప్రధానంగా నగరాలు, పట్టణాల అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, నీటి వనరుల నిర్వహణ, నైపుణ్యాల అభివృద్ధి, స్పోర్ట్స్, సెమీ కండక్టర్ల తయారీ, పర్యావరణం, శాస్త్ర సాంకేతిక రంగాలకు ఉన్న అనుకూలతలను వివరించారు. తెలంగాణ ప్రభుత్వానికి సహకారం అందించేందుకు సింగపూర్ మంత్రి గ్రేస్ ఫు హైయిన్ సానుకూలంగా స్పందించారు. తెలంగాణ రైజింగ్

మిగతా 2 లో

### సెమీకండక్టర్ పరిశ్రమలో కీలక అడుగు

- సింగపూర్ పర్యటనలో పారిశ్రామికవేత్తలతో చర్చలు



## నీకు శిక్ష పడాలి

- సోమవారం శిక్ష ఖరారు చేస్తాం
- కోల్‌కత్తా ట్రైనీ డాక్టర్ కేసులో సంజయ్ రాజ్‌ను దోషిగా తేల్చిన సీబీఐ కోర్టు

.. 4లో



తెలంగాణలో టీడీపీని

## బలోపేతం చేస్తాం

ఏపీ విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్
ఎన్టీఆర్ ఘాట్‌లో నివాళి

03



## సైఫ్‌పై పదేపదే దాడి చేశాడు

- కరీనా కపూర్

02




03

## హౌసింగ్ బోర్డు భూములు అమ్మేందుకు రంగం సిద్ధం

స్థలాలు అమ్మితే ఊరుకునేది లేదు
కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

## కుంభమేళాలో జనసందోహం



ఉత్తర ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న కుంభమేళాలో ఏర్పాటుచేసిన తిరుమల నమూనా ఆలయంలో శ్రీవారి కల్యాణ ఉత్సవం వైభవంగా జరిగింది. తిరుమల శ్రీవారి ఆలయ ప్రధాన అర్చుకులు వేణుగోపాల దీక్షితులు ఆధ్వర్యంలో అర్చక బృందం శ్రీదేవి, భూదేవి సమేత స్వామి వారి ఉత్సవర్లను కల్యాణ వేదిక వద్దకు తీసుకొచ్చారు. వేదమంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, కంకణ ధారణ, మాంగళ్య పూజ, మంగళ సూత్రధారణ ఘట్టాలతో స్వామి అమ్మవార్ల కల్యాణాన్ని నిర్వహించారు. చివరిగా స్వామి అమ్మవార్లకు నక్షత్ర హారతి, మంగళహారతి సమర్పించారు.

02





ఎన్టీఆర్‌తో నా పెళ్లికి

## జనమే సాక్షి

- ఎన్టీఆర్ సతీమణి లక్ష్మీపార్వతి

02



## ఇస్రో మరో ఘనత

- వికాస్ ఇంజిన్ రీస్టార్ట్ పరీక్ష విజయవంతం

02

అమలు కానీ హామీలపై

## ఢిల్లీలో పచ్చి అబద్ధాలు



- తెలంగాణలా ఢిల్లీ ప్రజలను మోసం చేయాలని కుట్ర
- మాజీ మంత్రి హరీశ్‌రావు

03

## పాతకార్డులపై భయమెందుకు?

- అనర్హులను తొలగించడంలో మీనమేషాలెందుకు?
- అర్హులకే కార్డులు అందాలి.. బియ్యం ధరలు పెంచాలి
- అప్పడే దుబారాకు కళ్లెం వేయగలం

04



## స్థానిక సంస్థ ఎన్నికల్లో ఒంటరిగానే..

- రేవంత్ రెడ్డి చెబితే ఢిల్లీలో ఓట్లు వేస్తారా?
- బీఆర్ఎస్‌లో డైనింగ్ టేబుల్‌పై నిర్ణయాలు
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

03



## అరవింద్ కేజ్రీవాల్ కారుపై దాడి

- బీజేపీ గూండాల పనిగా ఆప్ ఆరోపణ

03



# పెట్టుబడులకు సింగపూర్ సుముఖం

మొదటి పేజీ తరువాయి

లక్ష్య సాధనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వంతో భాగస్వామ్యం పంచుకోవాలనే రాష్ట్ర ప్రభుత్వ ఆహ్వానాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ప్రధానంగా ఫ్యూచర్ సిటీ, మూసీ పునరుజ్జీవన ప్రాజెక్ట్, నీటి వనరుల నిర్వహణ, తెలంగాణ ఎంచుకున్న సుస్థిర వృద్ధి ప్రణాళికలపై ఎక్కువ ఆసక్తి ప్రదర్శించారు. పలు ప్రాజెక్టుల్లో పరస్పరం కలిసి పని చేసేందుకు అంగీకరించారు. ఉమ్మడిగా చేపట్టాల్సిన ప్రాజెక్టులు, వాటిపై అధ్యయనం చేసేందుకు ప్రత్యేక బృందాలను గుర్తించాలని నిర్ణయించారు. వివిధ రంగాల్లో సింగపూర్ అనుభవాలను పంచుకోవాలని, దేశంలోనే వేగంగా వృద్ధి చెందుతున్న తెలంగాణలో సంయుక్తంగా చేపట్టే ప్రాజెక్టుల కార్యాచరణ వేగవంతం చేయాలని నిర్ణయించారు.



# సెమీకండక్టర్ పరిశ్రమలో కీలక అడుగు



**ప్రజానావ, హైదరాబాద్:** సెమీకండక్టర్ పరిశ్రమలో కీలక పెట్టుబడులను ఆకర్షించడంలో తెలంగాణ మరో ముందడుగు వేసింది. తెలంగాణలో ఉన్న అవకాశాలు, ఆధునిక మౌలిక సదుపాయాలు, అనుకూల మైన విధానాలు సింగపూర్ పారిశ్రామికవేత్తలను ఆకర్షించాయి. ఈ భాగస్వామ్యం తెలుగు రాష్ట్రానికి కొత్త ఉద్యోగాల కల్పనతో పాటు, ఆర్థికాభివృద్ధికి సహాయపడే అవకాశం ఉంది. సెమికండక్టర్ పరిశ్రమను రాష్ట్రానికి తీసుకురావడానికి తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న ఈ ప్రయత్నాలు భవిష్యత్తులో మరిన్ని పెట్టుబడులను ఆకర్షించేందుకు దోహదపడనున్నాయి. హైదరాబాద్‌ను గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్‌గా మార్చడంలో ఈ భాగస్వామ్యం కీలక పాత్ర పోషించనుంది. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు సింగపూర్‌లో సెమికండక్టర్ పరిశ్రమ అసోసియేషన్ (ఎస్ఎస్ఐఏ)తో ప్రత్యేక రౌండ్ టేబుల్ చర్చ నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ సంస్థలు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. తెలంగాణలో పెట్టుబడి అవకాశాలపై చర్చించారు. ఈ సమావేశంలో ఎస్ఎస్ఐఏ ఛైర్మన్ బ్రియాన్ టాన్, వైస్ ఛైర్మన్ టాన్ యూ కాంగ్, సెక్రటరీ సి.ఎస్. చుహ తదితర ప్రతినిధులు పాల్గొన్నారు. చర్చల్లో రాష్ట్రంలో సెమికండక్టర్ పరిశ్రమ స్థాపనకు అందుబాటులో ఉన్న అనుకూలమైన పరిస్థితులను మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. రాష్ట్రంలో ఉన్న పారిశ్రామిక వాతావరణం, ప్రపంచ పెట్టుబడిదారులకు ప్రభుత్వం అందించే సహకారం ప్రోత్సాహకాలను వివరించారు. సెమికండక్టర్ పరిశ్రమ వేగంగా విస్తరిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో, తెలంగాణ కీలకమైన కేంద్రంగా నిలుస్తుందని అన్నారు. తెలంగాణ ప్రభుత్వ ఆహ్వానానికి ఎఎస్ఐఏ ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. పరిశ్రమల పెట్టుబడులకు ఆసక్తి ప్రదర్శించారు. ఈ ఏడాది చివర్లో సింగపూర్ నుంచి తమ ప్రతినిధుల బృందం హైదరాబాద్‌ను సందర్శించి, పరిశీలన జరుపుతారని తెలిపారు.



# 65 లక్షల మందికి ఆస్తిహక్కు కార్డులు

### వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పంపిణీ

### ఆస్తి హక్కులతో భరోసా వస్తుందన్న ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ:** ప్రధాని నరేంద్ర మోడీ శనివారం సుమారు 65 లక్షల ఆస్తి హక్కు కార్డులు పంపిణీ చేశారు. అవి ఆర్థిక కార్యకలాపాలను పెంపొందిస్తాయని, దారిద్ర్య నిర్మూలనకు దోహదం చేస్తాయని ప్రధాని మోడీ ప్రకటించారు. ప్రధాని మోడీ వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా లబ్ధిదారులు కొంత మందితో మాట్లాడారు. ఈ పథకం రుణాలు, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందడానికి తోడ్పడుతుందని ఆయన చెప్పారు. పది రాష్ట్రాలు ఛత్తీస్‌గఢ్, గుజరాత్, హిమాచల్ ప్రదేశ్, మధ్య ప్రదేశ్, మహారాష్ట్ర, మిజోరామ్, ఒడిశా, పంజాబ్, రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్, రెండు కేంద్ర పాలిత ప్రాంతాలు జమ్మూ కాశ్మీర్, లడఖ్‌లలోని 50 వేల పైచిలుకు గ్రామాల్లో లబ్దిదారులకు ఈ ఆస్తి కార్డులు పంపిణీ చేశారు.'శనివారం 65 లక్షల కార్డుల పంపిణీ దృష్ట్యా గ్రామాల్లోని సుమారు 2.24 కోట్ల మంది లబ్దిదారుల వద్ద ఇప్పుడు స్వమిత్వ ఆస్తి కార్డులు ఉంటాయి' అని ప్రధాని తెలిపారు. 'ఆస్తి హక్కులు ప్రపంచ వ్యాప్తంగా పెద్ద సవాల్. కొన్ని ఏళ్ల క్రితం ఐక్యరాజ్య సమితి (యుఎన్) ఒక సర్వే నిర్వహించింది. పలు దేశాల్లో ఆస్తి హక్కులకు సంబంధించిన చట్టబద్ధ పత్రాలు జనం వద్ద లేవని ఆ సర్వే వెల్లడించింది. దారిద్ర్య నిర్మూలనకు ఆస్తి హక్కులు ముఖ్యం అని యుఎన్ స్పష్టం చేసింది' అని మోడీ తెలియజేశారు. గ్రామాల్లో ఆస్తి ఒక 'వ్యర్థ మూలధనం' అని, దానితో ప్రజలు ఏమీ చేయలేరని, వారి ఆదాయం పెంపునకు అది తోడ్పడదని ప్రముఖ ఆర్థికవేత్త ఒకరు అభిప్రాయం వ్యక్తం చేశారని ప్రధాని చెప్పారు. 'భారత్‌పై ఈ సవాల్ ప్రభావం పడింది. గ్రామాల్లో ప్రజల వద్ద లక్షలాది రూపాయలు విలువ చేసే ఆస్తి ఉంది, కానీ వారి వద్ద ఆ ఆస్తి పత్రాలు లేవు. వివాదాలు ఉన్నాయి, ఆస్తులు లాక్కున్నారు, తుదకు బ్యాంకులు సైతం దానిపై రుణాలు ఇవ్వడం లేదు' అని ఆయన వివరించారు. 'పూర్వపు ప్రభుత్వాలు దాని గురించి ఏదైనా చేయడానికి చర్యలు తీసుకున్నాయి. కానీ అంతగా ఏదీ జరగలేదు' అని ఆయన చెప్పారు. దళితులు, వెనుకబడిన తరగతులవారు, ఆదివాసీలు దీని వల్ల దారుణంగా నష్టపోయారని మోడీ తెలిపారు. 'చట్టబద్ధమైన ఆస్తి హక్కులు పొందిన తరువాత లక్షలాది మంది ప్రజలు రుణం తీసుకున్నారు. తమ వ్యాపారాలు ప్రారంభించేందుకు వారు ఈ డబ్బు ఉపయోగించు కున్నారు. వారిలో అనేక మంది రైతులు, వారికి ఈ ఆస్తి కార్డులు ఆర్థిక భద్రతకు గ్యారంటీ' అని మోడీ చెప్పారు. స్వమిత్వ, భూ ఆధార్ గ్రామాల అభివృద్ధికి పునాది అవుతాయని కూడా ప్రధాని మోడీ తెలిపారు. కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ 'లలన్', సహాయ మంత్రి ఎస్‌పి సింగ్ భాఘెల్, కార్యదర్శి వివేక్ భరద్వాజ్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పలువురు సిఎంలు, కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు వర్చువల్‌గా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

# ఎన్టీఆర్‌తో నా పెళ్లికి జనమే సాక్షి

### కొందరు దుర్మార్గులు 29 ఏళ్లుగా వేధిస్తున్నారు

### ఎన్టీఆర్ సతీమణి లక్ష్మీపార్వతి ఆవేదన



**ప్రజానావ, హైదరాబాద్:** లక్షలాది మంది ముందే దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ తనని పెళ్లి చేసుకొని భార్యగా ఇంటికి తీసుకొచ్చారని ఆయన సతీమణి లక్ష్మీ పార్వతి తెలిపారు. 29 ఏళ్లుగా దుర్మార్గులు తనని వేధిస్తున్నారని, ఇప్పటికీ తన జీవితాన్ని నాశనం చేయడానికి కొందరు దుర్మార్గులు ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఎన్టీఆర్ ఆనందం కోసం, ఆరోగ్యం కోసం సేవ చేశానని, చివరికి కొందరి కుతంత్రాల వల్ల ఆయన తనని వదిలేసి వెళ్ళిపోయారన్నారు. దివంగత ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్ 29 వర్ధంతి సందర్భంగా ఎన్‌టిఆర్ ఘాట్ వద్ద లక్ష్మీ పార్వతి నివాళులర్పించారు. అనంతరం ఆమె కీలక వ్యాఖ్యలు చేశారు. ఎన్‌టిఆర్ దూరం కావడంతో 29 ఏళ్లుగా మనోవేదనపడుతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. టిడిపి వారు సోషల్ మీడియాలో తన ఫోన్ నంబర్ పెట్టడంతో రోజుకు 1000 మంది ఫోన్ కాల్స్ చేసి బెదిరిస్తున్నారన్నారు. సిఎం చంద్రబాబు నాయుడు అనుకున్నా అనుకోకున్న మీ అత్తాగారినేనని, ఇలాంటి అవమానం జరుగుతుంటే బాబు చూస్తూ ఉంటారా? అని ప్రశ్నించారు. తన దగ్గర డబ్బులు ఉన్నాలేకున్న ఎవరినీ చేయిచాచి అడగలేదని, ఎన్‌టిఆర్ గౌరవం కాపాడేలా బ్రతుకుతున్నానని, తన మీద కక్ష ఎందుకు అని అడిగారు.


# ఇస్రో మరో ఘనత

### వికాస్ ఇంజిన్ రీస్టార్ట్ పరీక్ష విజయవంతం

### లిక్విడ్ ఇంజిన్‌ను విజయవంతంగా పునఃప్రారంభించినట్లు వెల్లడి

**న్యూఢిల్లీ:** ఇస్రో మరో మైలురాయిని సాధించింది. మహేంద్రగిరిలోని ప్రొపల్షన్ కాంప్లెక్స్‌లోని పరీక్షా కేంద్రంలో వికాస్ లిక్విడ్ ఇంజిన్‌ను విజయవంతంగా పునఃప్రారంభించినట్లు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ శనివారం తెలిపింది. ఇస్రో ప్రయోగ వాహక నౌకలకు లిక్విడ్ స్టేజ్‌లకు శక్తినిచ్చేదే ఈ వికాస్ ఇంజిన్ అని చెప్పింది. ఈ నెల 17న వికాస్ లిక్విడ్ ఇంజిన్‌ను మళ్లీ మండించినట్లు పేర్కొంది. తొలుత ఇంజిన్‌ను 60 సెకన్ల పాటు.. ఆ తర్వాత 120 సెకన్ల పాటు ఆపివేసి.. మళ్లీ ఏడు సెకన్ల పాటు మండించారు. పరీక్ష సమక్షంలో అన్ని పారామితులు సాధారణంగా ఉన్నట్లు తెలిపింది. ఇంజిన్ పనితీరును మరింత మెరుగుపరిచేందుకు అదనపు పరీక్షలు నిర్వహించేందుకు ప్రణాళికలు జరుగుతున్నాయని తెలిపింది. ఇటీవల ఇస్రో నింగిలో రెండు ఉపగ్రహాలను విజయవంతంగా అనుసంధానించి.. అంతరిక్ష చరిత్రలో భారత్ పేరును లిఖించింది. ఇస్రో ప్రతిష్ఠాత్మకంగా స్పేస్ డాకింగ్ ఎక్స్‌పరిమెంట్ (స్పేడెక్స్) చేపట్టింది. స్పేడెక్స్ ప్రయోగం విజయవంతమవడం ద్వారా భారత్ చరిత్ర సృష్టించింది. ఉపగ్రహాల డాకింగ్ సామర్థ్యం కలిగిన నాలుగో దేశంగా మన దేశం అవతరించింది. నింగిలో రెండు ఉపగ్రహాలను అనుసంధానం చేసిన భారత్.. అమెరికా, రష్యా, చైనా దేశాల సరసన సగర్వంగా చేరింది.







# దుండగుడు దొంగతనం చేయలేదు

### సైఫ్‌పై పదేపదే దాడి చేశాడు కరీనాకపూర్

**ముంబై:** సైఫ్ అలీఖాన్‌పై దాడి జరిగిన ఘటన గురించి కరీనా కపూర్ పోలీసులకు వివరించింది. ఇంట్లోకి చొరబడిన వ్యక్తి.. దూకుడుగా దాడి చేసినట్లు ఆమె చెప్పింది. అయితే ఆ దుండగుడు ఇంట్లో ఉన్న ఆభరణాలను టచ్ చేయలేదని తెలిపింది. బాంద్రా అపార్ట్‌మెంట్‌లో జరిగిన అటాక్ గురించి పోలీసులకు ఆమె తెలియజేసింది. సైఫ్‌తో ఘర్షణ జరిగిన సమయంలో ఆ వ్యక్తి చాలా దూకుడుగా వ్యవహరించి నట్లు చెప్పింది. పదేపదే సైఫ్‌పై అటాక్ చేయడాన్ని చూశానని కరీనా తెలిపింది. సైఫ్‌ను ఆస్పత్రికి తీసుకెళ్లేందుకే ప్రియార్టీ ఇచ్చినట్లు పేర్కొన్నది. దాడి తర్వాత దుండగుడు పారిపోయాడని, విలువైన వస్తువుల్ని ఏమీ తీసుకెళ్లలేదని కరీనా తెలిపింది. పిల్లలు తైముర్, జెహంగిర్‌ను రక్షించే ఉద్దేశంతో ఖాన్ ప్రతిదాడి చేసినట్లు ఆమె చెప్పింది. జెహంగిర్ వద్దకు దుండుగడు చేరుకోలేకపోయాడని, ఆ టైంలో ఖాన్‌పై పలుమార్లు అతను అటాక్ చేసినట్లు ఆమె తెలిపింది. దాడి తర్వాత చాలా ఆందోళనకు గురయ్యానని, అందుకే సోదరి కరిశ్మా తనను ఆమె ఇంటికి తీసుకెళ్లినట్లు తెలిపింది.

# కుంభమేళాలో జనసందోహం

### పుణ్యస్నానం ఆచరించిన రాజనాథ్ సింగ్



**ప్రయాగ్‌రాజ్:** ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక ఉత్సవంగా ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న 'మహాకుంభ్ మేళా'లో జనసందోహం పెరుగుతోంది. ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చి పుణ్యస్నానాలు చేస్తున్నారు. సాధులు, సంతులు, విదేశీ భక్తులు భారీగా తరలి వస్తున్నారు. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ శనివారంనాడు కుంభమేళాలో పాల్గొన్నారు. గంగ, యుమున, సరస్వతీ నదుల సంగమమైన త్రివేణి సంగమంలో పవిత్ర స్నానం ఆచరించారు. గంగా హారతిలో పాల్గొన్నారు. గత ఆరు రోజులుగా జరుగుతున్న ఈ మహోత్సవంలో ఇంతవరకూ దేశ, విదేశాలకు చెందిన 7.3 కోట్ల మందికి పైగా భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించారు.మహాకుంభోత్సవం పాల్గొనడం భగవంతుడు తనకు ఇచ్చిన అవకాశం భావిస్తున్నట్టు రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. 'భగవంతుడు నాకీ మహదవకాశం ఇచ్చారు. ఈరోజు సంగమంలో స్నానం చేశాను. జీవితం ధన్యమైందని అనిపించింది. సనాతన ధర్మ ఆధ్యాత్మిక అనుభవానికి, భారతీయ సంస్కృతికి ప్రతీక ఈ ఉత్సవం. సామాజిక సామరస్యత, సనాతన ధర్మ ఆధ్యాత్మికత, శాస్త్రీయతలను గంగా, యమునా, సరస్వతి సంగమం చాటుచెబుతోంది. ప్రపంచవ్యాప్తంగా విశేషంగా పాల్గొంటున్న ఈ అతిపెద్ద ఉత్సవాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తున్న ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను అభినందించి తీరాలి. ఆయనకు నా హృదయపూర్వక అభినందనలు' అని ఆయన చెప్పారు. ‡ాజ్‌నాథ్ సింగ్ వెంట బీజేపీ ఎంపీ సుధాన్షు త్రివేది, పలువురుపార్టీ నేతలు మహాకుంభ్‌లో పాల్గొన్నారు. ఈ మహోత్సవాలకు 45 కోట్ల మంది వస్తారని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం అంచనాగా ఉంది. తొల రెండు రోజుల్లో 5.20 కోట్ల మంది పవిత్ర స్నానాలు చేశారు.



# స్థానిక సంస్థ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ

- రేవంత్ రెడ్డి చెబితే ఢిల్లీలో ఓట్లు వేస్తారా?
- బీఆర్ఎస్‌లో డైనింగ్ టేబుల్‌పై నిర్ణయాలు
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ పోటీపై కేంద్ర మంత్రి, టీ బీజేపీ చీఫ్ కిషన్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. లోకల్ బాడీ ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగానే పోటీ చేస్తోందని ఆయన స్పష్టం చేశారు. నాంపల్లిలోని బీజేపీ కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో చిట్ చాట్ నిర్వహించిన కిషన్ రెడ్డి.. బీజేపీ అధ్యక్ష పదవిపైన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బీజేపీ అధ్యక్షుడిగా ఎంపిక కావాలంటే తప్పకుండా ఆర్ఎస్ఎస్ బ్యాక్‌గ్రౌండ్ ఉండాల్సిన అవసరం లేదని చెప్పారు. రెండుసార్లు బీజేపీ క్రియాశీలక సభ్యత్వం ఉన్న చాలు లేదా రెండుసార్లు బీజేపీ గుర్తుపై పోటీ చేసినా సరిపోతుందని క్లారిటీ ఇచ్చారు. మేడ్చల్ ఎంపీ ఈటల రాజేందర్ కూడా బీజేపీ అధ్యక్ష రేసులో ఉంటారని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని అధిష్ఠానమే నిర్ణయిస్తుందని.. హైకమాండ్ డెసిషనే ఫైనల్ అని తేల్చి చెప్పారు. కేసీఆర్ తర్వాత బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎవరో అందరికి తెలుసని.. అదే బీజేపీ తర్వాత అధ్యక్షుడు ఎవరో బీఆర్ఎస్ చెప్పగలదా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్‌లో నిర్ణయాలు డైనింగ్ టేబుల్‌పై జరుగుతాయని ఎద్దేవా చేసిన కిషన్ రెడ్డి.. బీజేపీలో అలా కాదని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు చేశామని సీఎం రేవంత్ రెడ్డి అబద్ధాలు చెబుతున్నాడని.. అసలు రేవంత్ రెడ్డి చెబితే ఢిల్లీ ప్రజలకు కాంగ్రెస్‌కు ఓటేస్తారా? అని నిలదీశారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్లు కూడా రావని కిషన్ రెడ్డి జోస్యం చెప్పారు. ఉచితాలకు బీజేపీ వ్యతిరేకం కాదని.. కానీ ప్రజలను మోసం చేయకుండా రాష్ట్ర ఆదాయాన్ని దృష్టిలో పెట్టుకుని హామీలు ఇవ్వాలని సూచించారు. అలా కాకుండా అడ్డగోలు హామీలు ఇచ్చి రాష్ట్రాని దివాలా తీయించే పరిస్థితులు తీసుకురావొద్దని సూచించారు. ఇక, నిజామాబాద్‌లో కాంగ్రెస్ వల్లే జాతీయ పసుపు బోర్డు ఏర్పాటు అయ్యిందన్న కాంగ్రెస్ నాయకులను ఈడ్చి కొట్టాలని ఘాటు వ్యాఖ్యలు చేశారు కిషన్ రెడ్డి.

### హైడ్రా చట్టం పాతదే!

చెరువుల ఆక్రమణను అరికట్టే చట్టం గతంలోనూ ఉందని, పాత చట్టానికే కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రా అని పేరు పెట్టిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల్లో ఉద్యోగులకు వేతనాలు ఇవ్వలేని స్థితిలో ఉందని విమర్శించారు. ఏడు నెలలుగా జీహెచ్ఎంసీ పరిధిలో వీధిలైట్ల నిర్వహణకు నిధులు రావడం లేదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణను అప్పుల రాష్ట్రంగా చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం దానిని కొనసాగిస్తోందన్నారు. మెట్రో రైల్ రెండో దశకు కేంద్ర ప్రభుత్వం నుంచి సాయం అందుతోందన్నారు. ఇది తమ బాధ్యత అని పేర్కొన్నారు.

# హౌసింగ్ బోర్డు భూములు అమ్మేందుకు రంగం సిద్ధం

- స్థలాలు అమ్మితే ఊరుకునేది లేదు
- కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హెచ్చరిక



**ప్రజానావ, హైదరాబాద్:** అడ్డగోలుగా ఇచ్చిన హామిలను నెరవేర్చలేక ఆపసోపాలు పడుతున్న రేవంత్ రెడ్డి సర్కారు హౌసింగ్ బోర్డు భూములను అమ్మేందుకు రంగం సిద్ధం చేసిందని బిఆర్ఎస్ మండిపడుతోంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న హౌసింగ్ బోర్డు, రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ పరిధిలోని ఇండ్ల స్థలాలు, అమ్ముడుపోని ఎ÷–లాట్లను వేలం వేస్తున్నది. తద్వారా రూ.3,500 కోట్లకు పైగా నిధుల సమీకరించాలని లక్ష్యం పెట్టుకున్నది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో హౌసింగ్ బోర్డు స్థలాల అమ్మకాలపై కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు స్పందించారు. భూములను అమ్ముకుంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో హౌసింగ్ బోర్డును అభివృద్ధి చేశామన్నారు. 24 ఎకరాల హౌసింగ్ బోర్డు భూములను సుప్రీంకోర్టుకు వెళ్లి కాపాడుకున్నామని చెప్పారు. ఆ భూములను అభివృద్ధి చేయడం మానేసిన కాగ్రెస్ ప్రభుత్వం.. భూములను అమ్మి హైదరాబాద్‌ను నాశనం చేస్తున్నదని విమర్శించారు. 6 గజాల నుంచి 30 గజాల వరకు వేలం నిర్వహించడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా ప్రయోజనాల కోసం హౌసింగ్ బోర్డు స్థలాన్ని వదిలేయాలని చెప్పారు. ఈ నెల 24న జరుగనున్న వేలం పాటను అడ్డుకుంటామని స్పష్టం చేశారు. ఆర్థిక లోటును పూడ్చుకునేందుకు ప్రభుత్వ భూములను అమ్మకానికి పెడుతున్నది రేవంత్‌రెడ్డి సర్కారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న హౌసింగ్ బోర్డు, రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ పరిధిలోని ఇండ్ల స్థలాలు, అమ్ముడుపోని ఎ÷–లాట్లను వేలం వేసి రూ.3,500 కోట్లకు పైగా నిధుల సమీకరణకు సిద్ధమైంది. దీనికి సంబంధించిన నోటిఫికేషన్ త్వరలో విడుదల కానుంది. ఈ వేలం ద్వారా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధిలో, హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) పరిధిలో మొత్తం 1,400కు పైగా ఓపెన్ ఎ÷–లాట్లు (100–500 చదరపు గజాల మధ్య), కరీంనగర్, ఖమ్మం, గద్వాల తదితరజిల్లాల్లో అమ్మకానికి సిద్ధం చేశారు. వీటితోపాటు ఇంకా పూర్తికాని 361 ఇండ్లు అమ్మకానికి పెట్టారు. పోచారం, బండ్లగూడ, నాగోల్ సమీపంలోని రాజీవ్ స్వగృహ గేటెడ్ టౌన్‌షిప్‌లు, జవహర్‌నగర్, గాజులరామారం తదితర ప్రాంతాల్లో ఇంకా అమ్ముడుపోని 700 ఎ÷–లాట్లను కాంగ్రెస్ సర్కారు అమ్మే ప్రయత్నం చేస్తున్నది. ఈ ఎ÷–లాట్లు 2007 నుంచి ఇప్పటివరకు అమ్ముపోకుండా ఉన్నాయి. 54 కేపీహెచ్‌బీ ఎ÷–లాట్లకు ఈ నెల 24న, గచ్చిబౌలి, బాలాజీనగర్, భరత్‌నగర్‌లోని ఏడు ఎ÷–లాట్లకు ఈ నెల 30న, రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం రావిర్యాలలోని 42 ఎ÷–లాట్లకు వచ్చేనెల 5న వేలం నిర్వహించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మిగతా వాటికి ఫిబ్రవరిలో, మార్చిలో వేలం వేయనున్నట్టు తెలిసింది. ఆర్బీఐ నుంచి అప్పుచేసినా బండి నడవకపోవడంతో ఆర్థికలోటును ఎదుర్కోవడానికి ప్రభుత్వం ఇండ్లస్థలాలు, అమ్ముడుపోని ఎ÷–లాట్లను వేలం ద్వారా విక్రయిస్తున్నది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో నవంబర్ వరకు రాష్ట్ర ఆదాయం రూ.1.03 లక్షల కోట్లుగా ఉన్నది. నిరుడు ఇదే కాలంలో రూ.1.11 లక్షల కోట్లు వచ్చింది. నవంబర్ చివరి నాటికి మొత్తం ఆదాయం సుమారు రూ.1.41 లక్షల కోట్లు ఉండగా, వ్యయాలు రూ.1.38 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. ఈలోగా రూ.2,621 కోట్ల రుణాలు, చెల్లింపుల కోసం ఖర్చుచేశారు. దాంతో రాష్ట్రానికి రూ.14,288 కోట్ల ఆదాయ లోటు, రూ.37,850 కోట్ల ఆర్థిక లోటు ఏర్పడింది. ఈ లోటును స్థలాలు, ప్లాట్ల వేలం ద్వారా పూడ్చుకోవాలని భావిస్తున్నది.

# ఎన్టీఆర్ ప్రజల గుండెల్లో బతికే ఉన్నారు

- జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే గోపీనాథ్
- ఫిల్మ్‌నగర్ చౌరస్తాలో ఎన్టీఆర్ వర్ధంతి
- హాజరైన ఎన్టీఆర్ కుటుంబసభ్యులు, సినీ, రాజకీయ నేతలు

**ప్రజానావ, ఖైరతాబాద్:** మాజీ ముఖ్యమంత్రి, స్వర్గీయ నందమూరి తారక రామారావు ప్రజల గుండెల్లో ఇప్పటికీ బతికే ఉన్నారని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు మాగంటి గోపీనాథ్ ఆయన సేవలను కొనియాడారు. నందమూరి తారక రామారావు 29వ వర్ధంతిని శనివారం ఫిల్మ్‌నగర్ చౌరస్తాలో ఆయన విగ్రహం వద్ద నిర్వహించారు. జూబ్లీహిల్స్ డివిజన్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నందమూరి కుటుంబసభ్యులతో పాటు యూసఫ్‌గూడ కార్పొరేటర్ రాజ్ కుమార్ పటేల్, పరుచూరి గోపాల కృష్ణ ముఖ్య అతిథులుగా పాల్గొని పూలమాలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్ మాట్లాడుతూ సినీ, రాజకీయ రంగాల్లో తెలుగు ప్రజల కీర్తి ప్రతిష్టలు ప్రపంచానికి చాటిన మహానుభావుడు దివంగత నందమూరి తారక రామారావు అని కొనియాడారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ కుమారుడు నందమూరి మోహన్ కృష్ణ, మనవరాలు నందమూరి మోహన రూప, ప్రొడ్యూసర్ కౌన్సిల్ మెంబెర్ ప్రసన్న, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.





# అరవింద్ కేజ్రీవాల్ కారుపై దాడి..

## బీజేపీ గూండాల పనిగా ఆప్ ఆరోపణ

**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధిపతి, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ కారుపై దాడి జరిగింది. ఎన్నికల ప్రచారం సందర్భంగా ఆయన ఉన్న వాహనంపై రాళ్లు విసిరారు. బీజేపీ అభ్యర్థి పర్వేష్ వర్మ గూండాల పనిగా ఆప్ ఆరోపించింది. అయితే దీనిని ఆయన ఖండించారు. కేజ్రీవాల్ కారు ఇద్దరు యువకులను ఢీకొట్టిందని విమర్శించారు. న్యూఢిల్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న అరవింద్ కేజ్రీవాల్ శనివారం ఆ ప్రాంతంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొందరు వ్యక్తులు ఆయన వాహనాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. అలాగే అరవింద్ కేజ్రీవాల్ ఉన్న కారుపై రాళ్లు విసిరారు. అప్రమత్తమైన పోలీసులు కేజ్రీవాల్ కారును అక్కడి నుంచి పంపివేశారు. కాగా, అరవింద్ కేజ్రీవాల్ కారుపై దాడికి సంబంధించిన వీడియో క్లిప్‌ను సోషల్ మీడియాలో ఆప్ పోస్ట్ చేసింది. బీజేపీ అభ్యర్థి పర్వేష్ వర్మ గూండాలు ఈ చర్యకు పాల్పడినట్లు ఆరోపించింది. 'ఓటమి భయంతో బీజేపీ ఆందోళన చెందుతోంది. అరవింద్ కేజ్రీవాల్‌పై దాడికి తన గూండాలను ఉపయోగించింది. అరవింద్ కేజ్రీవాల్ ప్రచారం చేస్తున్నప్పుడు బీజేపీ అభ్యర్థి పర్వేష్ వర్మ గూండాలు ఇటుకలు, రాళ్లతో దాడి చేశారు. ఆయనను గాయపరిచేందుకు ప్రయత్నించారు. కేజ్రీవాల్ ప్రచారం చేయకుండా చేయాలనుకున్నారు. బీజేపీ వ్యక్తుల పిరికి దాడికి కేజ్రీవాల్ భయపడరు. ఢిల్లీ ప్రజలు మీకు తగిన సమాధానం ఇస్తారు' అని ఎక్స్‌లో పేర్కొంది. మరోవైపు ఆప్ ఆరోపణలను బీజేపీ అభ్యర్థి పర్వేష్ వర్మ ఖండించారు. అరవింద్ కేజ్రీవాల్ వాహనం ఇద్దరు యువకులను ఢీకొట్టిందని ఆరోపించారు. 'ప్రజలు ప్రశ్నలు అడుగుతుండగా, అరవింద్ కేజ్రీవాల్ తన కారుతో ఇద్దరు యువకులను ఢీకొట్టారు. వారిద్దరినీ లేడీ హార్డింగ్ ఆసుపత్రికి తరలించారు. ఓటమిని ఎదురుగా చూసిన ఆయన, ప్రజల ప్రాణాల విలువను మరిచిపోయారు. నేను ఆసుపత్రికి వెళుతున్నా' అని ఎక్స్‌లో పోస్ట్ చేశారు.





# తెలంగాణలో టీడీపీని బలోపేతం చేస్తాం : నారా లోకేశ్

**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణలో టీడీపికి ఇంకా ఎనలేని ఆదరణ ఉందని, త్వరలోనే టీడీపీకి పూర్వ వైభవం తేస్తామని ఏపీ మంత్రి నారా లోకేశ్ అన్నారు. తెలంగాణలో తెలుగుదేశం పార్టీని మళ్లీ విస్తరిస్తామని, ఈ దిశగా చర్చలు జరుపుతున్నామన్నారు. త్వరలోనే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్ ఎన్టీఆర్ ఘాట్ వద్ద నారా లోకేశ్ నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో 1.60 లక్షల మంది టీడీపీ సభ్యత్వం తీసుకున్నారని, పార్టీపై తెలంగాణ ప్రజలకు ప్రేమ, ఆశ ఉందంటూ వ్యాఖ్యానించారు. ఇక్కడ పార్టీని బలోపేతం చేయడమే తమ లక్ష్యమని చెప్పారు. తెలంగాణలో టీడీపీపై ప్రజలకు ఎంతో ప్రేమ ఉన్నదని, స్వచ్ఛందంగా 1.6 లక్షల మంది సభ్యత్వాలు పొందడమే దానికి ఉదాహరణ అని చెప్పారు. తమకు ఇక్కడ ఒక్క ఎమ్మెల్యే కూడా లేకపోయినా ఇంతమంది సభ్యత్వం తీసుకున్నారని వెల్లడించారు. రాబోయే రోజుల్లో ఇక్కడ కూడా పార్టీ కార్యకలాపాలు ప్రారంభిస్తామన్నారు.

# అమలు కానీ హామీలపై ఢిల్లీలో పచ్చి అబద్ధాలు

## తెలంగాణలా ఢిల్లీ ప్రజలను మోసం చేయాలని కుట్ర : మాజీ మంత్రి హరీశ్‌రావు



**ప్రజానావ,హైదరాబాద్:** ఇచ్చిన హామీలు అమలు చేశామని ఢిల్లీకి వెళ్లి అబద్ధాలు ప్రచారం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పచ్చి అబద్ధాలు ఆడుతున్నారని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఎన్నికల సమయంలో తెలంగాణ ఎలాగైతే మోసం చేశారో అలాగే ఢిల్లీ ప్రజలను కూడా మోసం చేయాలని చూస్తున్నారని అన్నారు. ఒకటో తేదీనే వేతనాలు చెల్లిస్తామని అధికారంలోకి వచ్చిన మీకు చిరు ఉద్యోగుల కష్టాలు కనిపించకపోవడం దురదృష్టకరమని అన్నారు. నాలుగు నెలలుగా పంచాయతీ కార్మికులు, మూడు నెలలుగా ఉద్యోగులు, నెల గడిచినా మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్మికులు వేతనాలు అందక వెతలు పడుతున్నారని హరీశ్‌రావు తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్, ఏపీఓలు ఇలా వేల మంది చిరు ఉద్యోగులు జీతాలు ఇవ్వాలని ప్రభుత్వానికి దరఖాస్తులు పెట్టుకున్న దయనీయ పరిస్థితి నెలకొందని అన్నారు. దాదాపు అన్ని జిల్లాల్లో ఇదే పరిస్థితి ఉన్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. నెలలు గడిచినా వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణ భారమై, అప్పుల పాలవుతున్నారని తెలిపారు. కండ్లు కాయలు కేసులా జీతాల కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. కుర్చీ కాపాడుకోవడం కోసం ఢిల్లీకి చక్కర్లు కొట్టడం, విదేశాలకు వెళ్లి వేల కోట్ల పెట్టుబడులు తెస్తున్నామనే డబ్బా ప్రచారం చేసుకోవడం మానేసి పాలనపై దృష్టి సారించాలని సూచించారు. ఇప్పటికైనా చిరు ఉద్యోగులందరికీ సకాలంలో వేతనాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# తెలంగాణకు కాంగ్రెస్ చేసిన పాపాలు అంతా ఇంత కాదు

## కాలువల తవ్వమంటే గత్వాన్ని తవ్వుతున్నారు : మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణకు కాంగ్రెస్ నాయకులు చేసిన పాపాలు అంతా ఇంత కాదని, కాంగ్రెస్ పాలనలో తెలంగాణ కుంటుపడిందని ఒక్కసారి గతాన్ని చూసుకోవాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. కాంగ్రెస్ నేతలను కాలువలు తవ్వమంటే గతాన్ని తవ్వుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ తెలంగాణకు సాగునీటి రంగం విషయంలో చేసిన పాపాలు తవ్వితే పుట్టల నుంచి పాములు వచ్చినట్టు వస్తాయని అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శ్రీనివాస్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ.. బ్రిజేష్ ట్రిబ్యునల్ తాజా మధ్యంతర ఉత్తర్వులు ముమ్మాటికీ కేసీఆర్ ఘనతే అని ఆయన స్పష్టం చేశారు. పదేళ్ల కేసీఆర్ పాలనలోనే మహబూబ్‌నగర్ అభివృద్ధి జరిగిందని శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. బీఆర్ఎస్ ఏ పనిచేయలేదని అనే మహబూబ్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎవరైనా సరే తమ పదవులకు రాజీనామా చేసి ఎన్నికల్లో గెలిచి చూపించాలని సవాలు విసిరారు. విభజన చట్టం సెక్షన్ 89 కాంగ్రెస్ తెచ్చింది కాదా.. దాని ప్రకారం కృష్ణా జలాల పంపిణీకి కేసీఆర్ ఒప్పుకుంటే బ్రిజేష్ ట్రిబ్యునల్ తాజా ఉత్తర్వులు వచ్చేవా అని శ్రీనివాస్ గౌడ్ ప్రశ్నించారు. కేసీఆర్ అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోపే సెక్షన్ 3 ప్రకారం నీళ్ల పంపిణీ జరగాలని కేంద్రానికి లేఖ రాశారని గుర్తుచేశారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని సూచించారు. కేసీఆర్‌ను ఇంకా విమర్శిస్తూ ఉంటే ప్రజలు నవ్వుకుంటున్నారని అన్నారు. పెండింగ్ ప్రాజెక్టులను రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చిన ఘనత కేసీఆర్‌దే అని ఆయన కొనియాడారు. కేసీఆర్ హయాంలో పాలమూరులోని పది లక్షల ఎకరాలకు నీళ్లిచ్చామని శ్రీనివాస్ గౌడ్ గుర్తుచేశారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి ఒకసారి రికార్డులను తెప్పించుకోవాలని సూచించారు. పాలమూరు నుంచి వలసలు తగ్గించింది కేసీఆర్ కాదా ని ప్రశ్నించారు. పాలమూరు వెనకబడటానికి ఎక్కువ కాలం పాలించిన కాంగ్రెస్‌దే పాపం అని ఆయన విమర్శించారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు డీపీఆర్ ను కేంద్రం వెనక్కి పంపడానికి కుట్రదారులు ఎవరో ముందు ఉత్తమ్ కనిపెట్టాలని అన్నారు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..

4 ఆదివారం 19 జనవరి 2025

# పాతకార్డులపై అమాత్యుల్లో భయమెందుకు?

- అనర్హులను తొలగించడంలో మీనమేషాలెందుకు
- అర్హులకే కార్డులు అందాలి.. బియ్యం ధరలు పెంచాలి
- అప్పుడే దుబారాకు కళ్లెం వేయగలం



**ప్రజానావ, హైదరాబాద్:** నకిలీ రేషన్ కార్డులను ఎత్తేయడంలోనూ..బియ్యం ధరలు పెంచడంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యింది. దుబారా తగ్గించుకుంటే తప్ప అప్పులు కట్టలేని దుస్థితి ఉంది. ఈక్రమంలో ఒక్కో పథకాన్ని సమీక్షించుకుని ముందుకు సాగాల్సి ఉంది. కొత్తగా రేషన్ కార్డులు ఇచ్చే క్రమంలో పాతవి తొలగించడం లేదని పదేపదే ప్రకటనలు చేస్తున్నారు. పాతకార్డులు తొలగిస్తే ఎక్కడ తమ ఓటుబ్యాంక్ గల్లంతు అవుతుందో అన్న భయం నేతలను వెన్నాడుతోంది. నిజానికి పాత కార్డుల్లో అనర్హులను తొలగించాల్సిందే. దీనికి ధైర్యంగా ప్రకటన చేయాలి. ఇందులో తప్పులేదు. అలాగే అనర్హులకు కార్డులు ఇచ్చి బియ్యం ఇవ్వడం అన్నది దుబారా కిందకే వస్తుంది. అలాగే 2025లో కూడా ఇంకా రూపాయికే కిలో బియ్యం ఇవ్వాలన్న ఆలోచన కూడా దుర్మార్గమైనదే. ఈ రెంటినీ సమీక్షించకుంటే ఖజానాకు బొక్క పడుతూనే ఉంటుంది. ఇకపోతే చాలామంది అర్హులు కార్డులకోసం గత దశాబ్దకాలంగా ఎదురుచూస్తున్నారు. ప్రజల సుదీర్ఘ ఎదురుచూపులకు తెరపడనుంది. దాదాపు దశాబ్దకాలం తర్వాత తెలంగాణలో కొత్త రేషన్‌కార్డులు రానున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 6.68 లక్షల కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు ఇవ్వనున్నారు. సమగ్ర కుటుంబ సర్వే ఆధారంగా పౌరసరఫరాలశాఖ అనేక వడపోతల అనంతరం జాబితా సిద్ధం చేసినట్లు సమాచారం. ప్రభుత్వం నుంచి ఏ చిన్న పథకం పొందాలన్నా ముందుగా అడిగేది రేషన్‌కార్డే. పేదలకు గుర్తింపు కార్డుగా మారిన రేషన్ కార్డులను దాదాపు దశాబ్దకాలం పాటు కేసీఆర్ సర్కార్ అందజేయలేదు. ఎప్పుడు అడిగినా ఇదిగో, అదిగో అంటూ కాలం వెళ్లదీసారు. తప్ప...తెలంగాణ ఏర్పడిన తర్వాత ఒక్కసారే ఒక్కసారి కూడా పూర్తిస్థాయిలో పేదలకు రేషన్‌కార్డులు అందలేదు. అన్ని అర్హతలు ఉండి కూడా రేషన్‌కార్డు లేక ఎందరో ప్రభుత్వ పథకాలకు దూరమయ్యారు. ఆఖరికి ఆస్పత్రుల్లో చికిత్స పొందడానికి కూడా రేషన్‌కార్డే ప్రమాణికంగా ఉండటంతో పేదప్రజలు రేషన్ కార్డుల కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. ఇప్పుడు ఆ పేదల నిరీక్షణ ఫలించింది. కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ కొద్దిరోజుల్లో ప్రారంభం కానుంది. ఎన్నికల హామీల్లో భాగంగా కాంగ్రెస్ సర్కార్ ఇచ్చిన మాట ప్రకారం కొత్త రేషన్ కార్డులను అందజేస్తోంది. రేవంత్‌రెడ్డి సర్కార్ తీసుకురానున్న ఐదు గ్యారెంటీలు అమలు చేయాలంటే ముందుగా అర్హులను గుర్తించాలి. ఆవిధమైన అర్హుల గుర్తింపు కోసమే ముందుగా రేషన్‌కార్డులను ప్రభుత్వం జారీ చేస్తోంది. ఇటీవలే నిర్వహించిన ఇంటింటి సర్వేతోపాటు... ప్రజాపాలన దరఖాస్తుల ఆధారంగా ప్రభుత్వం వివరాలు సేకరించింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 6.68 లక్షల కుటుంబాలు రేషన్ కార్డులకు అర్హమైనవిగా గుర్తించారు. ఈ జాబితాను రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు పంపించి ఈనెల 20 నుంచి 24 వరకు గ్రామసభలు, బస్తీ సభలు నిర్వహించనున్నారు. అభ్యంతరాల స్వీకరణ తర్వాత తుది జాబితా ఖరారు చేయనున్నారు. జిల్లా కలెక్టర్లు ఖారారు చేసిన జాబితా ప్రకారం పౌరసరఫరాల శాఖ కార్డులను మంజూరు చేయనుంది. జనవరి 26వ తేదీ నుంచి అర్హులైన వారికి కొత్త రేషన్ కార్డులు అందజేయనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఐదుగ్యారెంటీలైన ఆరోగ్యశ్రీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సబ్సిడీ గ్యాస్, ఫీజు రియింబర్స్‌మెంట్ వంటి సంక్షేమ పథకాలకు రేషన్‌కార్డే ఆధారం. అందుకే రేషన్‌కార్డులకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. గతంలో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించగా....ఇప్పుడు మాత్రం ఇటీవల నిర్వహించిన సమగ్ర సర్వే నుంచి వివరాలు సేకరిస్తున్నారు. కొత్త రేషన్ కార్డులు కావాలన్నవారి వివరాలు, కుటుంబ సభ్యుల పేర్లు నమోదు చేయించుకునేవారి వివరాలను వడబోశారు. అన్ని అర్హతలు పరిశీలించిన తర్వాత 6,68,309 కుటుంబాలకు కొత్త కార్డులు అందజేయాలని నిర్ణయించారు. గ్రామసభల అనంతరం కొత్త కార్డులు జారీ చేయనున్నారు. హైదరాబాద్‌లోనే అత్యధికంగా 83 వేల285 మంది అర్హులు ఉండగా...వనపర్తి జిల్లాలో అత్యల్పంగా 6 వేల647 కుటుంబాలు ఉన్నాయి. ప్రస్తుతానికి సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సంతకాలతో కూడిన లేఖలనే కార్డులుగా అందజేస్తారు. కొంతకాలం తర్వాత పాతవారికి, కొత్తవారికి కలిపి కొత్త రేషన్ కార్డులు అందజేయనున్నారు. అయితే ఎప్పటికైనా అర్హులను గుర్తించడం ముఖ్యం. అర్హులకే బియ్యం లేదా ఇతర పథకాలు అందాలి. అలాగే బియ్యం ధరలను కనీసం పది రూపాయలైనా చేయాల్సిందే.

## కళల నిలయంగా వేములవాడను తీర్చిదిద్దుతాం

ప్రాచీన కళలను కాపాడే దిశగా చర్యలు

సాంస్కృతిక కళాశాలను అప్‌గ్రేడ్ చేస్తాం

ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

వైభవంగా ప్రారంభమైన త్యాగరాజ ఆరాధన మహోత్సవాలు



**ప్రజానావ, వేములవాడ:** వేములవాడను కళల నిలయంగా తీర్చిదిద్ది, ప్రాచీన కళలను కాపాడే దిశగా చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, దేవాదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానంలో నాద బ్రహ్మ, లయ బ్రహ్మ సద్గురు శ్రీ త్యాగరాజ స్వామి వారి 72వ ఆరాధన ఉత్సవాలను శనివారం ప్రభుత్వ విప్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. రాజన్న ఆలయంలో జరుగుతున్న సద్గురు త్యాగరాజ స్వామి ఆరాధన ఉత్సవాలకు ఎంతో చరిత్ర ఉందన్నారు. ఏడు దశాబ్దాలుగా ప్రతి ఏటా ఆరాధన ఉత్సవాలు ఎంతో వైభవంగా నిర్వహించబడుతుండడం గొప్ప విషయమన్నారు. పెద్దలు సాంబయ్య ప్రారంభించిన ఈ ఉత్సవాలు దక్షిణ కాశీగా పేరుగాంచిన రాజన్న ఆలయంలో 72ఏళ్లుగా నేటికీ నిర్విరామంగా కొనసాగుతుండడం అభినందనీయమన్నారు. ఇది వేములవాడ ప్రాంతానికి గర్వకారణమని పేర్కొన్నారు. కళాకారుల్లో ఉన్న కళలను వెలికి తీయడానికి త్యాగరాజ ఉత్సవాలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

### కీర్తనల ద్వారా ఆధ్మాత్మిక చింతన

కీర్తనల ద్వారా ఆధ్యాత్మిక చింతన పెరుగుతుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. త్యాగరాజు రామభక్తి పరవశంతో వేలాది మహత్తరమైన కీర్తన రచించారని, వారి జీవిత చరిత్రను భావితరాల తెలియజేయాలన్నారు. త్యాగరాజు 800 కీర్తనలు 24000 రచనలు రచించినట్లు పేర్కొన్నారు. జగదానందకారక అనే కీర్తన ద్వారా శ్రీరామునికున్న 108 పేర్లను ప్రస్తావిస్తూ ప్రఖ్యాత భక్తి విజయం 'నౌక చరితం' అనే నాట్య రూపకాలను రచించారన్నారు. త్యాగరాజ ఉత్సవాలు, కళలను కాపాడుతూ, భక్తి భావం పెంపొందించడానికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. రాజన్న ఆలయాల్లో కళలను కాపాడే విధంగా సాంస్కృతిక కళాశాల నడపడం జరుగుతుందని, దీనిని అప్‌గ్రేడ్ చేసే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు.

### ఆలయ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా మంత్రుల సహకారాలతో రాజన్న ఆలయంతో పాటు నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. రాజన్న భక్తులకు మెరుగైన వసతలు కల్పించడానికి కృషి చేస్తామని చెప్పారు. రాబోయే రోజుల్లో భక్తులను దృష్టిలో పెట్టుకొని మరో వందేళ్లు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నామని, ఇప్పటికే రూ.35 కోట్లతో అన్నదాన సత్రం ఏర్పాటు చేశామని, ఇందులో భాగంగా మంత్రి పొన్నం ప్రభాకర్ రూ.35లక్షలు, విప్‌గా తను రూ.10 లక్షలు విరాళంగా ఇచ్చామని ఎమ్మెల్యే గుర్తుచేశారు. ప్రతిరోజూ 10వేల మంది భక్తులు భోజనం చేసేలా అన్నదాన సత్రం నిధిని రూ.100 కోట్లకు పెంచేదుకు కృషి చేస్తున్నట్లు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వివరించారు.



## సొంతంగా ఎన్టీఆర్ ఘాట్ నిర్వహణ

మరమ్మత్తులు చేపట్టాలని మంత్రి లోకేశ్ ఆదేశం

దివంగత నేత ఎన్టీఆర్‌కు కుటుంబ సభ్యుల నివాళి



**ప్రజానావ, హైదరాబాద్:** ఎన్టీఆర్ ఘాట్ నిర్వహణపై ఆంధ్రప్రదేశ్ విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. శనివారం ఎన్టీఆర్ 29వ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఘాట్‌కు లోకేశ్ చేరుకున్నారు. దివంగత మహానేత, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ ఘాట్ వద్ద లోకేశ్ నివాళులు అర్పించారు. అయితే ఘాట్ నిర్వహణను చూసి ఆయన తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఘాట్ గోడలు, పైకప్పు పెచ్చులు ఊడిపోవడం, గార్డెన్‌లో ఏర్పాటు చేసిన లైట్లు విరిగిపడి ఉండటాన్ని లోకేశ్ గమనించారు. ఘాట్ నిర్వహణ బాధ్యతలు చూడాల్సిన హెచ్‌ఎండీఏ తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ ఘాట్ మరమ్మతు పనులు తన సొంత నిధులతో వెంటనే చేపట్టాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు ఎన్టీఆర్ ఘాట్ నిర్వహణను హెచ్‌ఎండీఏ అధికారులు పట్టించుకోవడం లేదంటూ అక్కడికి వచ్చిన ఎన్టీఆర్ అభిమానులు సైతం తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. ఇదేనా ఓ మహానేతకు ఇవ్వాల్సిన గౌరవం అంటూ మండిపడ్డారు. ఘాట్ నిర్వహణ తమకు అప్పగించాలని గతంలో పలుమార్లు తెలంగాణ ప్రభుత్వానికి ఎన్టీఆర్ ట్రస్ట్ విజ్ఞప్తి చేసింది. దీనిపై తెలంగాణ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదు. తాజాగా ఎన్టీఆర్ ఘాట్ నిర్వహణను చూసి ఎంతో బాధపడిన మంత్రి లోకేశ్.. అవసరమైన అనుమతులు తీసుకొని వీలైనంత తొందరగా మరమత్తు పనులు పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. కాగా, శనివారం ఉదయం నుంచీ ఎన్టీఆర్ ఘాట్ వద్దకు నందమూరి, నారా కుటుంబసభ్యులు, బంధువులు, ఎన్టీఆర్ అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చి దివంగత నేతకు నివాళి అర్పించారు. హిందూపురం ఎమ్మెల్యే, సినీ నటుడు బాలకృష్ణ, జూ.ఎన్టీఆర్, కల్యాణ్ రామ్, లక్ష్మీపార్వతి, ఏపీ ఉపసభాపతి రఘురామకృష్ణరాజు సహా పలువురు ప్రముఖులు వచ్చి ఎన్టీఆర్‌కు నివాళులు అర్పించారు.

## నీకు శిక్ష పడాలి



- సోమవారం శిక్ష ఖరారు చేస్తాం
- కోల్‌కత్తా ట్రైనీ డాక్టర్‌కేసులో సంజయ్‌రాజ్‌ను దోషిగా తేల్చిన సీల్దా సీబీఐ కోర్టు

**కోల్‌కతా:** దేశవ్యాప్తంగా సంచలనం రేపిన కోల్‌కతాలోని ఆర్జీ కర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారం జరిగిన కేసులో సీల్దాలోని సీబీఐ కోర్టు శనివారం తీర్పు ఇచ్చింది. పోలీస్ వాలంటీర్ అయిన నిందితుడు సంజయ్ రాయ్‌ను దోషిగా నిర్ధారించింది. కోర్టులో ప్రవేశపెట్టిన నిందితుడిని ఉద్దేశించి 'నీకు శిక్ష పడాలి' అని న్యాయమూర్తి అన్నారు. శిక్షలను సోమవారం ఖరారు చేస్తామని తెలిపారు. కాగా, గత ఏడాది ఆగస్టు 9న ఆర్జీ కర్ మెడికల్ కాలేజీ, ఆసుపత్రిలో రాత్రి విధుల్లో ఉన్న 31 ఏళ్ల జూనియర్ డాక్టర్‌పై హత్యాచార సంఘటన జరిగింది. సివిల్ వాలంటీర్ సంజయ్ రాయ్‌ను ప్రధాన నిందితుడిగా పోలీసులు గుర్తించారు. ఆగస్ట్ 10న అతడ్ని అరెస్ట్ చేశారు. కలకతా హైకోర్టు ఆదేశాల మేరకు ఈ కేసు దర్యాప్తును సీబీఐ చేపట్టింది. ఆర్జీ కర్ మెడికల్ కాలేజీ మాజీ ప్రిన్సిపాల్‌ను కూడా సీబీఐ అధికారులు అరెస్ట్ చేశారు. మరోవైపు దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తిన ఈ కేసులో 120 మంది సాక్షులను సీబీఐ విచారించింది. నిందితుడికి మరణశిక్ష విధించాలని కోర్టులో వాదించింది. జనవరి 9న ఈ కేసులో వాదనలు పూర్తయ్యాయి. దీంతో సీల్దాలోని సీబీఐ కోర్టు శనివారం తీర్పు ఇచ్చింది. నిందితుడు సంజయ్ రాయ్‌ను దోషిగా నిర్ధారించింది. సోమవారం శిక్షలు ఖరారు చేస్తామని కోర్టు వెల్లడించింది.

# మత్తు పదార్థాల నిర్మూలనకు కలిసి పోరాడుదాం

- పోస్టర్లను ఆవిష్కరించిన మంత్రి పొన్నం ప్రభాకర్, విప్ ఆది శ్రీనివాస్

**ప్రజానావ, చిగురుమామిడి/వేములవాడ:** డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. రేవంత్ రెడ్డి పిలుపు మేరకు డ్రగ్స్, మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రజలకు అవగాహన కల్పించాలనే సంకల్పంతో తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ రాష్ట్రవ్యాప్త ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయ మని కొనియాడారు. త్వరలో నిర్వహించబోయే డ్రగ్స్ వ్యతిరేక ప్రచార కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ను శనివారం చిగురుమామిడిలో మంత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ టీఎస్ జేయూ రాష్ట్ర అధ్యక్షుడు నారగౌని పురుషోత్తం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్, రాష్ట్ర సహాయ కార్యదర్శి నరేశ్, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు కొల్లూరు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గున్నాల నరేశ్, ఉపాధ్యక్షులు దూస రాజేందర్, కోడం కనకయ్య, ముఖ్య సలహాదారు రైకనపాట శ్రీనివాస్, కొలగాని చందు, ఏనుగుల శ్రీనివాస్, చిలుకదాసు, కోడం సంతోష్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు కందికొండ మోహన్, ప్రధాన కార్యదర్శి కుమార్, ఉపాధ్యక్షులు కందికొండ గంగరాజు, ఈద శ్రీనాథ్, యూనియన్ సభ్యులు శ్రీహరి, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

### డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం కృషి చేయాలి

డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పిలుపునిచ్చారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో నిర్వహించబోయే డ్రగ్స్ వ్యతిరేక ప్రచార కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ను శనివారం వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని గెస్ట్ హౌస్‌లో ఆది శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌జేయూ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు కొల్లూరు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గున్నాల నరేశ్, ఉపాధ్యక్షులు దూస రాజేందర్, కోడం కనకయ్య, కొలగాని చందు, ఏనుగుల శ్రీనివాస్, చిలుకదాసు, కోడం సంతోష్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.





ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
ఆదివారం
19 జనవరి 2025


# వ్యవసాయ యోగ్యం కాని భూములను తొలగించాలి

- అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్
- వేములవాడ రూరల్ , చందుర్తి మండలాల్లో ఆకస్మిక తనిఖీ



**ప్రజానావ, వేములవాడ రూరల్/చందుర్తి/ కోనరావుపేట:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా కు సంబంధించిన జాబితా నుంచి వ్యవసాయ యోగ్యం కాని భూములను తొలగించాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ ఆదేశించారు. వేములవాడ రూరల్ మండలం నాగయ్యపల్లి, చందుర్తి మండలం జోగాపూర్, వేములవాడ పట్టణంలోని 28, 29 వార్డులు, కోనరావుపేట మండలం ధర్మారంలో రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలు, నూతన రేషన్ కార్డుల జారీకి కొనసాగుతున్న సర్వేను అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలు, నూతన రేషన్ కార్డుల జారీకి కొనసాగుతున్న సర్వే పకడ్బందీగా చేయాలని అధికారులను ఆదేశించారు. అర్హులను గుర్తించి, వారికి ఆయా పథకాలు అందించాలని సూచించారు. అదనపు కలెక్టర్ వెంట జిల్లా పశు వైద్యాధికారి, మండల ప్రత్యేక అధికారి రవీందర్ రెడ్డి, డిస్ట్రిక్ట్ ఆడిట్ ఆఫీసర్ శ్రీనివాస్, వేములవాడ అర్బన్, వేములవాడ రూరల్ , చందుర్తి తహసీల్దార్లు సుజాత, శ్రీనివాస్, విజయ్ ప్రకాశ్ రావు, మహేశ్, చందుర్తి, ఎంపీడీఓ ప్రదీప్, వేములవాడ మున్సిపల్ కమిషనర్ అన్వేష్ తదితరులున్నారు.




అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ముద్రించిన 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత, ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ వీ.నరేందర్ రెడ్డి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో యువత ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారం కోసం ఏఐవైఎఫ్ పోరాటాలు చేస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువజన అభివృద్ధి కోసం, ఉపాధి అవకాశాలు కల్పన కోసం ఒక నిర్దిష్టమైన విధివిధానాలను రూపొందించాల్సిన అవసరం ఉందని వారు కోరారు.

\- ప్రజానావ, కరీంనగర్

## డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 75మందికి కౌన్సెలింగ్

**పలువురికి జైలు, జరిమానా విధించిన వేములవాడ కోర్టు**



**ప్రజానావ, వేములవాడ:** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలో శనివారం మద్యం తాగి వాహనం నడిపిన 75మందికి కౌన్సెలింగ్ నిర్వహించి, కోర్టులో హాజరు పరిచినట్లు వేములవాడ టౌన్ సీఐ బీ.వీరప్రసాద్ పేర్కొన్నారు. పట్టుబడిన వారిలో నలుగురికి వేములవాడ కోర్టు జ్యూడిషల్ మేజిస్ట్రేట్ రెండు రోజుల జైలు శిక్ష, రూ. 2,500 జరిమానా, మరో ఐదుగురికి ఒకరోజు జైలు, రూ. 2,500, ఏడుగురికి మూడు రోజుల జైలు, రూ. 2,500 జరిమానా, 41మందికి రూ. 1,500 జరిమానా విధించారు. ఇంకో 12 మందికి రూ. 2,500 జరిమానా, ఆరుగురికి రూ. 2,500 జరిమానా విధించినట్లు ఇన్స్పెక్టర్ తెలిపారు.

# కందుల కొనుగోలుకు ప్రణాళికబద్ధంగా చర్యలు



- క్వింటాల్‌కు రూ.7,550 మద్దతు ధర అందించాలి
- అధికారులతో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ సమీక్ష

**ప్రజానావ, సిరిసిల్ల బ్యూరో:** ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ లో వచ్చే కందుల పంటను మద్దతు ధరపై కొనుగోలు చేసేందుకు ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ అన్నారు. శనివారం అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని తన చాంబర్ లో కందుల కొనుగోలు పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌లో కందుల కొనుగోలు యాక్షన్ ప్లాన్ ను అధికారులు అదనపు కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ మాట్లాడుతూ, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 1129 ఎకరాల 28 గుంటల భూమిలో కందుల సాగు జరిగిందని, ప్రస్తుత వానాకాలం 6, 211 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉందని, మార్క్ ఫెడ్ ద్వారా రైతులకు మద్దతు ధర వచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. వానాకాలం 2024-25 సీజన్ లో ప్రతి క్వింటాల్ కందుల పంటకు రూ. 7,550 మద్దతు ధర తప్పనిసరిగా అందించాలని అన్నారు. కందుల పంట కొనుగోలుకు వ్యవసాయ సహకార సంఘాలు, డీసీఎంఎస్ లలో అనువైన కేంద్రాలను గుర్తించాలని అదనపు కలెక్టర్ సహకార అధికారికి సూచించారు. కందుల పంట ను కొనుగోలు కేంద్రాల నుంచి సమీపంలో ఉండే స్టోరేజ్ పాయింట్ కు తరలించేందుకు వీలుగా రవాణా ఏర్పాట్లు చేసుకోవాలని, మార్క్ ఫెడ్ వద్ద అవసరమైన మేరా గన్ని బ్యాగులు, వెయింగ్ యంత్రాలు, తేమ యంత్రాలు ఇతర సామాగ్రి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

### హమాలీల కొరత రావొద్దు

జిల్లాలో వ్యవసాయ మార్కెట్ యార్డులు, ఎఫ్.సి.ఐ గోదాములు , ఇతర గోదాముల వద్ద అందుబాటులో ఉన్న స్థలాన్ని పరిశీలించి కందుల స్టోరేజ్ కోసం ఎంపిక చేయాలని, కందులు కొనుగోలు అంశంలో సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించాలని, కందులు కొనుగోలు వద్ద హమాలీల కొరత రాకుండా జాగ్రత్త వహించాలని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా మార్క్‌ఫెడ్ అధికారి హబీబ్, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జలిబేగం, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి వసంత లక్ష్మి, శాఖ మేనేజర్ రజిత, వ్యవసాయ మార్కెట్ కమిటీల కార్యదర్శులు , సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ రేషన్ కార్డులివ్వాలి



**బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి**

**ప్రజానావ, కరీంనగర్:** రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వారికి అరకొరగా కేవలం 25శాతం మందికి మాత్రమే రేషన్ కార్డులు జారీ చేసి చేతులు దులుపుకోవడం పట్ల బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. చొప్పదండి మండలం రాగంపేటలో రేషన్ కార్డు దరఖాస్తుదారులు గ్రామ పెద్దలు, బీజేపీ నాయకులతో కలిసి గ్రామ పంచాయతీ కార్యదర్శి ద్వారా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి పంపమని వినతి పత్రం అందజేశారు. రాగంపేట గ్రామంలో 290 మంది దరఖాస్తు చేస్తే 69 మందికి మాత్రం వచ్చాయని చెబుతూ మిగిలినవారికి ప్రభుత్వ అధికారులు మొండి చేయి చూపిస్తున్నారని చొప్పదండి మండలములో మూడువేల మంది రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేస్తే 790 మందితో జాబితా విడుదల చేసి మమ అనిపించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అత్యంత ధనిక రాష్ట్రమైన తెలంగాణ రాష్ట్రంలో 20శాతం కుటుంబాలు రేషన్ కార్డు సమస్యలతో సతమతమవడం రాష్ట్రంలో కొనసాగుతున్న అసమర్థ పాలనకు తార్కాణమన్నారు. రేషన్ కార్డు లేకపోవడంతో విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, ప్రధాన మంత్రి ఆయుష్మాన్ యోజన లాంటి పథకాలు కూడా వర్తించే పరిస్థితి ఉండదని అన్నారు.

## రోడ్డు ప్రమాదంలో కాంగ్రెస్ నేత గోలి చంద్రారెడ్డి దుర్మరణం



**ప్రజానావ, తిమ్మాపూర్:** తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి వద్ద శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గోలి చంద్రారెడ్డి (55) దుర్మరణం చెందారు. బైక్‌పై వెళ్తుండగా కారు ఢీకొనడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. ఈ విషయం తెలిసిన వెంటనే మానకొండూర్ శాసనసభ్యుడు డా.కవ్వంపల్లి సత్యనారాయణ హుటాహుటిన ప్రమాదస్థలికి చేరుకున్నారు. శోకసముద్రంలో మునిగిపోయిన చంద్రారెడ్డి కుటుంబ సభ్యులను ఆయన ఓదార్చారు. అంతేకాకుండా చంద్రారెడ్డి ఆకస్మిక మృతిపట్ల ఆయన దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ నాయకులు సుధగోని లక్ష్మీనారాయణ గౌడ్, మోరపల్లి రమణారెడ్డి, కొత్త తిరుపతిరెడ్డి, కొమ్మెర రవీందర్ రెడ్డి, ద్యావ శ్రీనివాస్ రెడ్డి, వీరచంద్రారెడ్డి, తిరుపతి, నోముల అనిల్ తదితరులున్నారు.

# ముగిసిన వాహనాలు, వస్తువుల వేలం



**ప్రజానావ, సిరిసిల్ల:** రాజన్న సిరిసిల్ల జిల్లాలో పలు సందర్భాల్లో స్వాధీనం చేసుకున్న, రోడ్ల మీద వదిలేసిన 54 వాహనాలకు జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో శనివారం వేలం నిర్వహించారు. ఈ వేలం ద్వారా వచ్చిన రూ. 5.36లక్షల ఆదాయం సమకూరింది. ఆయా పోలీస్ స్టేషన్లలో సర్వీస్ లో లేని కిట్ ఆర్టికల్స్, పాతబడిన టెంట్లు, ఇనుప సామగ్రి, జనరేటర్, స్టోర్ మొదలగు వస్తువులకు వేలంపాట నిర్వహించగా, ఈ వేలం నిర్వహణ ద్వారా వచ్చిన రూ. 1.54 లక్షలను ప్రభుత్వ ఖాతాలో జమ చేయడం జరుగుతుందని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. 60 మందికి పైగా కొనుగోలుదారులు ఈ వేలం పాటలో పాల్గొన్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ మురళీకృష్ణ, ఆర్ఐలు మధూకర్, రమేశ్, ఆర్ ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్డుభద్రతపై అవగాహన




**ప్రజానావ, పెద్దపల్లి:** పెద్దపల్లి జిల్లాలోని గాయత్రి డిగ్రీ, పీజీ కళాశాలలో శనివారం రోడ్డుభద్రత నియమ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి పెద్దపల్లి జిల్లా ట్రాఫిక్ సీఐ అనిల్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 18 ఏళ్లు నిండి వాహనాలు నడిపే వారంతా బాధ్యతగా డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలని, టూవీలర్ నడిపేటప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. అలాగే వాహనం రిజిస్ట్రేషన్ పేపర్లు, ఇన్సూరెన్స్ పేపర్లు తప్పకుండా వెంట ఉంచుకోవాలని, ట్రిపుల్ రైడ్ చేయకూడదన్నారు. రాంగ్ రూట్‌లో ప్రయాణం చేయకూడదని, ట్రాఫిక్ సిగ్నల్స్ తప్పకుండా పాటించాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడపరాదని, అతివేగంగా వాహనాలు నడపకూడదన్నారు. 2024లో అజాగ్రత్తగా వాహనాలు నడపడం వల్ల నాలుగు లక్షల మంది ప్రమాదానికి గురయ్యారని, దాదాపు లక్ష 70 వేల మంది చనిపోయారన్నారు. విద్యార్థులు రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ తమ తోటి మిత్రులు, బంధువులతో పాటు సమాజంలో ప్రతి ఒక్కరికీ తమ వంతు బాధ్యతగా రోడ్డు భద్రత నియమాలను తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ, కళాశాల కరెస్పాండెంట్ అల్లెంకి శ్రీనివాస్, ప్రిన్సిపల్ జే. రవీందర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

# జాతీయస్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో రాష్ట్ర జట్టు విజేతగా నిలవాలి

- క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలి
- కరీంనగర్ మేయర్ సునీల్ రావు
- ఘనంగా ప్రారంభమైన రాష్ట్రస్థాయి బాలుర హ్యాండ్ బాల్ పోటీలు
- 10 ఉమ్మడి జిల్లాల నుంచి 200 మంది క్రీడాకారుల హాజరు



**ప్రజానావ, కరీంనగర్:** జాతీయస్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో తెలంగాణ రాష్ట్ర జట్టు విశేష ప్రతిభ చాటి విజేతగా నిలిచేందుకు కృషి చేయాలని కరీంనగర్ మేయర్ వై సునీల్ రావు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ స్టేడియంలో తెలంగాణ రాష్ట్ర స్థాయి బాలుర హ్యాండ్ బాల్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి మేయర్ ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించి మాట్లాడారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించే క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని అన్నారు. హ్యాండ్ బాల్ క్రీడా వేగవంతమైన క్రీడా అని ఈ క్రీడలో రాణించిన క్రీడాకారులు ఏ క్రీడనైనా సులువుగా ఆడగలరన్నారు. హ్యాండ్‌బాల్ పోటీలను ఘనంగా నిర్వహిస్తున్న రాష్ట్ర హెడ్ బాల్ అసోసియేషన్‌ను, కరీంనగర్ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్‌ను ఆయన అభినందించారు. విద్యార్థులు తప్పనిసరి క్రీడల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. మరో అతిథి తెలంగాణ రాష్ట్ర హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో హ్యాండ్ బాల్ క్రీడాభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. తక్కువ సమయంలోనే రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహించేందుకు ముందుకు వచ్చిన కరీంనగర్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్‌ను ఆయన అభినందించారు. ఈ పోటీల్లో 10 ఉమ్మడి జిల్లాల నుంచి 200 మంది క్రీడాకారులు 50 మంది అధికారులు పాల్గొన్నారు. వీరందరికీ మూడు రోజులపాటు ఉచిత వసతి సౌకర్యాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు నందెల్లి మహిపాల్, కార్యదర్శులు గసిరెడ్డి జనార్దన్ రెడ్డి, డీవైఎస్ఓవీ శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు

- ఎలాంటి షరతులు లేకుండా రైతు భరోసా
- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణానికి భూమి పూజ



**ప్రజానావ, వేములవాడ:** అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు పంపిణీ చేస్తామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణ కార్యక్రమాన్ని వేములవాడ పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో హౌసింగ్ శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ హాజరై భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలు, రేషన్ కార్డుల జారీ ప్రక్రియ ఈ నెల 26 వ తేదీ నుండి ప్రారంభంకానున్నదని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇండ్లు లబ్ధిదారులకు ఇవ్వడం జరుగుతుందని వివరించారు. గతంలో ప్రజాపాలన సమయంలో పెట్టుకున్న దరఖాస్తులను ఈ నెల 21 నుంచి 24 వ తేదీ వరకు పరిశీలించి లబ్ధిదారులను ఎంపిక జరుగుతుందని విప్ స్పష్టం చేశారు. జనవరి 26 నుండి రాష్ట్రవ్యాప్తంగా రైతులకు రైతు భరోసా కింద రూ. 12 వేలు ఎలాంటి షరతులు లేకుండా రైతులకు ఇస్తామని ప్రకటించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా భూమిలేని నిరుపేద కూలీలకు రూ.12వేలు ఇస్తామని వెల్లడించారు. నియోజకవర్గంలో 3500 ఇండ్లు వస్తూ ప్రత్యేక కోట కింద ముంపు గ్రామాల ప్రజలకు 4696 ఇండ్లు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని గుర్తు చేశారు.

### పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక చేయడం జరుగుతుందని విప్ స్పష్టం చేశారు.ప్రజా పాలన సమయంలో దరఖాస్తు చేయలేని వారు ప్రత్యేకంగా ఆయా ఆఫీసుల్లో దరఖాస్తు చేసి పోర్టల్‌లో నమోదు చేయడం జరుగుతుందని వివరించారు. ఇందిరమ్మ ఇండ్ల కాన్సెప్టే పేద ప్రజలకు ఇండ్లు మంజూరు చేయడ మేనని పేర్కొన్నారు. అధికారులు ఎవ్వరూ కూడా నిర్లక్ష్యం చేయకూడదనీ, సర్వే, గ్రామ, వార్డు సభల్లో అధికారులు ఓపిగ్గా ఉంటూ ప్రజలందరికీ సహాయ సహకారాలు అందించాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో కుల గణనను చేపట్టడం జరిగిందని విప్ చెప్పారు. రాబోవు రోజుల్లో పేద ప్రజలకు మేలైన కార్యక్రమాన్ని తీసుకొని ముందుకు పోతామని ప్రకటించారు. తాను కూడా 21 నుంచి నిర్వహించే సభల్లో పాల్గొంటాననీ తెలిపారు. మోడల్ హౌసును వీలైనంత త్వరగా నిర్మాణం చేపట్టి మన ప్రాంత ప్రజలకు నమూనాగా చూపెట్టాలనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జలి బేగం, మునిసిపల్ వైస్ చైర్మన్ బింగి మహేశ్, మార్కెట్ కమిటీ చైర్మన్ రోండి రాజు, పీడీ గృహ నిర్మాణ శాఖ జిల్లా అధికారి చెన్నయ్య, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, ఎమ్మార్వో మహేశ్, ఎంపీడీవో ఎన్ మల్హోత్రా, హౌసింగ్ డీఈలు భాస్కర్, ముజఫర్, ఎంపీడీవోలు శ్రీనివాస్,ఎన్ మల్హోత్ర, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా ప్రాంగణాన్ని సందర్శించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి



**ప్రజానావ, తిమ్మాపూర్:** తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీ కాలనీలోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా ప్రాంగణాన్ని మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ శనివారం సందర్శించారు. ఈ సందర్శన సందర్భంగా ఆయన ప్రాంగణంలో ఉన్న వివిధ భవనాలను, కుట్టు శిక్షణ కేంద్రాన్ని పరిశీలించి సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం ప్రాంగణ అభివృద్ధిపై ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రాంగణ అభివృద్ధికి గతంలో చేపట్టిన పనుల ప్రగతి గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే నూతనంగా చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపైన కూడా ఆయన సంబంధిత అధికారులతో చర్చించారు. ప్రాంగణంలో పిచ్చిమొక్కలు గుబురుగా పెరిగి ఉండటం గమనించిన ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి జేసీబీ సహాయంతో పిచ్చిమొక్కలను తొలగించే చర్యలు వెంటనే చేపట్టారు.

**ప్రాంగణంలో అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రాంగణం మరింత అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. మహిళా ప్రాంగణాన్ని సక్రమంగా నిర్వహించడం ద్వారా మహిళల శిక్షణా కేంద్రాల అభివృద్ధితోపాటు వారి ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు తోడ్పడతామన్నారు. ఈ ప్రాంగణం ఒక నూతన ఆర్థిక అభివృద్ధి కేంద్రంగా అవతరించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం ద్వారా మహిళల అభివృద్ధి, శిక్షణ, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడం లక్ష్యంగా అనేక చర్యలు తీసుకోనున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధగోని లక్ష్మినారాయణ గౌడ్, తిమ్మాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, పార్టీ నాయకులు కుంట రాజేందర్ రెడ్డి, పులి కృష్ణ, బుధారపు శ్రీనివాస్, పోలు రమేశ్, పోలు రాము, సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

# శాంతి భద్రతలు అదుపులో ఉంటేనే అభివృద్ధి సాధ్యం




- విద్యార్థులు చదువుతో పాటు సైబర్ నేరాలు, ట్రాఫిక్ సిగ్నల్స్ పై అవగాహన పెంచుకోవాలి
- సిరిసిల్లలో 'ఖాకీ కిడ్స్' కార్యక్రమాన్ని ప్రారంభించిన ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్

**ప్రజానావ, సిరిసిల్ల:** ఎక్కడైతే శాంతి భద్రతలు అదుపులో ఉంటాయో అక్కడ అభివృద్ధి సాధ్యమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే అది శ్రీనివాస్ అన్నారు. పోలీస్ శాఖ ప్రభుత్వంలో కీలకపాత్ర పోషిస్తుందని, జిల్లా పోలీస్ శాఖ ప్రజలకు చేరువగా యువతకు క్రీడల పోటీలు, ఆరోగ్య శిబిరాలు, డ్రైవింగ్ లెసైన్స్, సీసీ కెమెరాల ఏర్పాటు మొదలగు సామాజిక కార్యక్రమాలు చేపడుతూ, శాంతి భద్రతల పరిరక్షణతో పాటుగా ప్రజల శ్రేయస్సే లక్ష్యంగా జిల్లా పోలీసులు పనితీరు అభినందనీయమని కొనియాడారు. సైబర్ నేరాల నియంత్రణయే లక్ష్యంగా విద్యార్థులకు సైబర్ నేరాలపై, ట్రాఫిక్ సిగ్నల్స్ పై అవగాహన కల్పించి సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దాడమే లక్ష్యంగా ఎస్పీ అఖిల్ మహాజన్ శనివారం 'ఖాకీ కిడ్స్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమాన్ని లైబ్రరీ చైర్మన్ సత్యనారాయణ, విద్యార్థులు, పోలీస్ అధికారులతో కలిసి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుతం సమాజంలో సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసాగిస్తున్నారని, మోసాల బారిన ప్రజలు పడకూడదనే ఉద్దేశ్యంతో ప్రతి పోలీస్ స్టేషన్లలో సైబర్ వారియర్ లను ఎంపిక చేసి, వారికి సైబర్ నేరాలు జరిగే విధానం, ట్రాఫిక్ నియమలపై శిక్షణ ఇచ్చి జిల్లాలో ఉన్న అన్ని కళాశాల్లో, పాఠశాలల్లో విద్యార్థులకు ఇంటర్నెట్ దుర్వినియోగం, ఆన్‌లైన్ మోసాలు,సైబర్ మోసాల భారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరుగుతున్నారు. విద్యార్థులు ఖాకి కిడ్స్ కార్యక్రమన్ని సద్వినియోగం చేసుకొని తల్లిదండ్రులకి,కుటుంబ సభ్యులకు, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులు మంచిని స్వీకరించి చెడుకు దూరంగా ఉండాలని, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి గార్లని స్ఫూర్తిగా తీసుకుని భవిష్యత్ లో ఉన్నత స్థానాల్లో స్థిరపడి తల్లితండ్రులు, పుట్టిన ఊరికి గొప్ప పేరు తీసుకురావాలని సూచించారు. సంకల్పం, మనోబలం ఉంటే మనం అనుకున్న లక్ష్యాలను చేరుకోవచ్చాని అన్నారు. విద్యార్థుల జీవితంలో పదవ తరగతి పరీక్షలు మొదటి అడుగని, మార్చ్ లో నిర్వహించే పదవ తరగతి పరీక్షలో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. రాజన్న ఆలయంలో ఇటీవల జరిగిన పాప అపహరణ కేసును చాకచక్యంగా ఛేదించి రాష్ట్రస్థాయిలో జిల్లా పోలీస్ వారు మంచి పెరు తెచ్చుకున్నారని గుర్తుచేశారు.

**సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి**

ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ తప్పక పాటిస్తారనే ఉద్దేశ్యంతో ఖాకీ కిడ్స్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టి జిల్లాలో ప్రతి పోలీస్ స్టేషన్‌లో ఉన్న సైబర్ వారియర్లకు సైబర్ నేరాలకు జరుగు విధానం, ఎలా అరికట్టాలి, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించి రానున్న మూడు నెలల్లో జిల్లాలో ఉన్న అన్ని కళాశాలలు, పాఠశాలల్లోని విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని అనంతరం గ్రామాలలోని ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు సోషల్ మీడియాకి దూరంగా ఉండాలని, ప్రతి ఒక్కరూ సోషల్ మీడియాలో వ్యక్తిగత గోప్యత పాటించాలని సూచించారు. ప్రస్తుతం ఎక్కువగా వస్తున్న డిజిటల్ అరెస్ట్, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్, ఓటీపీ ఫ్రాడ్, సోషల్ మీడియాలో వచ్చే ఉద్యోగ ప్రకటనలు, అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే వీడియో కాల్స్ ఫ్రాడ్, ఓఎల్ఎక్స్ ఫ్రాడ్ వంటి వాటికి దూరంగా ఉండాలని ఎస్పీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ స్వరూప, డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సీఐలు కృష్ణ, శ్రీనివాస్, వీరప్రసాద్, శ్రీనివాస్, ఆర్ఐలు మధూకర్, రమేశ్, ఎస్ఐలు, విద్యార్థులు పాల్గొన్నారు.



బీజేపీ వేములవాడ అర్బన్ మండల అధ్యక్షుడిగా ఇటీవల నియామకమైన బుర్రశేఖర్ గౌడ్ ఏఎస్పీ శేషాద్రి రెడ్డిని శనివారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అంతకుముందు ఎమ్మార్వో మహేశ్, ఎంపీడీఓ రాజీవ్ మల్హోత్రాలనూ కలిశారు. ఆయన వెంట వేములవాడ అర్బన్ బీజేపీ నాయకులు చంద్రగిరి ప్రశాంత్, గోనె భాస్కర్, గుండెకర్ల లక్ష్మణ్, జింక శ్రీనివాస్, తిప్పారవేని రాజు, నర్సింగోజు శంకర్, ఎరుగోక్కుల రమేశ్, చల్ల నర్సయ్య, విశ్వనాథం శ్రీధర్, కొలనూర్ సంజీవ్ రెడ్డి, చింతకుంట నర్సయ్య, కాచం నిఖిల్, తునికి మహేశ్, నాంపల్లి అరవింద్, ముదం శ్రీనివాస్, చిట్ల అంజన్న, జింక శేఖర్, పోచంపల్లి భాను తదితరులున్నారు.

\- ప్రజానావ, వేములవాడ



## టీఎస్‌పీఈయూ 1535 సర్వసభ్య సమావేశం

**ప్రజానావ, కరీంనగర్:** తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ యూనియన్(టీఎస్ పీఈయూ) 1535 కరీంనగర్‌రీజియన్‌సర్వసభ్య సమావేశం శనివారం కరీంనగర్‌లోని పికాక్‌రెస్టారెంట్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జమీర్‌హాజరు అయ్యారు. ఇందులో ఆర్టిజన్ కార్మికులను కన్వర్షన్ చేయాలని, ఈపీఎఫ్ టు జీపీఎఫ్ అమలు చేయాలని, అన్ మాన్ కార్మికులు.. బిల్ కలెక్టర్లు తదితరులను రేగులరైజ్ చేయాలని, అనేక పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. ఈ సంఘంలో దాదాపు 100 మంది కార్మికులు ఏమే వజ్ర ఆధ్వర్యంలో 1535లో చేరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు ఎంఏ వజీర్, ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ, నాగేశ్వరరావు, కళ్యాణ్, శ్రీనివాస్ రెడ్డి, ఎం శ్రీనివాస్ మూర్తి, రాము, కుమారస్వామి, కరీంనగర్ సర్కిల్ నాయకులు జీ రాందాస్ నాయక్, గుండి సురేందర్, జియా తదితరులు పాల్గొన్నారు.




# రాజీవ్ స్వగృహాలో వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి

**పనులను పరిశీలించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి**

**ప్రజానావ, తిమ్మాపూర్:** తిమ్మాపూర్ మండలంలోని రామకృష్ణ కాలనీలో ఉన్న అంగారిక టౌన్‌షిప్ అభివృద్ధి పనులపై మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ప్రత్యేక దృష్టి సారించారు. శనివారం ఆయన జిల్లా అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయి, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డితో కలిసి టౌన్‌షిప్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అంగారిక టౌన్‌షిప్‌లో 2 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులు, రోడ్ల నిర్మాణం, వీధి దీపాల ఏర్పాటు, డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణం వంటి ప్రాథమిక మౌలిక వసతులపై ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి సారించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో పలు అంశాలపై సమీక్ష నిర్వహించి, తగు సూచనలు చేశారు. భగీరథ పైప్‌లైన్ రోడ్డు మధ్యలో విస్తరించినందున, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు తక్షణమే చేపట్టాలని ఆయన ఆదేశించారు.

### సుందరీకరణపై దృష్టి

అంగారిక టౌన్‌షిప్‌ను సుందరీకరించడంలో భాగంగా రోడ్ల మధ్య డివైడర్ల ఏర్పాటు చేసి, పూల మొక్కల నాటకం చేపట్టాలని సూచించారు. ప్రజల కోసం ఆకర్షణీహంగా తీర్చిదిద్దడమే కాకుండా శుభ్రమైన వాతావరణాన్ని కల్పించడానికి ఈ చర్యలు అత్యంత అవసరమని అధికారులకు గుర్తు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ, "అంగారిక టౌన్‌షిప్ వాసుల సమస్యలను క్షుణ్ణంగా అధ్యయనం చేశామని, ప్రతి పనిని సమయానికి పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం మా బాధ్యత," అని తెలిపారు. సమస్యల పరిష్కారంలో పారదర్శకత, వేగం పాటించడమే తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. అంగారిక టౌన్‌షిప్ అభివృద్ధికి సంబంధించిన అన్ని చర్యలను వేగంగా పూర్తి చేసి అంగారక వాసులకు మెరుగైన మౌలిక వసతులు అందించేందుకు కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే తెలిపారు.ఇవి స్థానికుల అభివృద్ధికి ఊతమిచ్చే చర్యలుగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధగోని లక్ష్మీనారాయణ గౌడ్, తిమ్మాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, మాజీ ఎంపీపీ కుంట రాజేందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు బుధారపు శ్రీనివాస్, మాచర్ల అంజయ్య, దావు సంపత్ రెడ్డి, పోలు రాము, మాచర్ల శ్రీనివాస్, సాధిక్ తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# ఛాంపియన్స్ ట్రోఫీకి భారత జట్టు

## వైస్ కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్



**ముంబై:** ఫిబ్రవరి 19 నుంచి ఛాంపియన్స్ ట్రోఫీ 2025 ప్రారంభం కానుంది. ఎనిమిది దేశాలు తలపడే ఈ టోర్నీ కోసం బీసీసీఐ భారత జట్టును ప్రకటించింది. కెప్టెన్ రోహిత్ శర్మ, చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. 15 మందితో కూడిన టీమ్‌ను వెల్లడించారు. ఏమైనా మార్పులు చేసుకోవడా నికి ఫిబ్రవరి 13 వరకు అవకాశం ఉంది. అంతకు ముందు వాంఖడే మైదానంలోనే దాదాపు రెండున్నర గంటలకు పైగా బీసీసీఐ సమావేశం జరిగింది. దీనికి ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ హాజరు కాలేదు. శుక్రవారమే తన నివేదికను సమర్పించినట్లు వార్తలు వస్తున్నాయి. ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌కూ ఇదే జట్టు కొనసాగుతుందని బీసీసీఐ వెల్లడించింది. ఫిబ్రవరి 6 నుంచి 12 మధ్య మూడు వన్డేల సిరీస్ జరగనుం ది. ఛాంపియన్స్ ట్రోఫీ గ్రూప్ ఏలో భారత్, పాకిస్థాన్, న్యూజిలాండ్, బంగ్లాదేశ్ జట్లు ఉన్నాయి. బంగ్లాదేశ్‌తో ఫిబ్రవరి 20న, పాక్‌తో ఫిబ్రవరి 23న, న్యూజిలాండ్‌తో మార్చి 2న టీమ్‌ఇండియా దుబాయ్ వేదికగా తలపడనుంది. దాదాపు ఎనిమిదేళ్ల తర్వాత ఈ ఐసీసీ టోర్నీ జరగబోతోంది. దాయాది దేశం పాకిస్థాన్ ఆతిథ్యం ఇస్తోంది. భారత్ ఆడే మ్యాచ్‌లు యూఏఈలోనూ జరగనున్నాయి. చివరిసారిగా టీమ్‌ఇండియా 2013లో ధోనీ నాయకత్వంలో విజేతగా నిలిచింది.

**జట్టు ఇదే..**

రోహిత్ శర్మ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్ (వైస్ కెప్టెన్), విరాట్ కోహ్లీ, కేఎల్ రాహుల్, రిషభ్ పంత్ (వికెట్ కీపర్), శ్రేయస్ అయ్యర్, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, హార్దిక్ పాండ్య, కుల్‌దీప్ యాదవ్, జస్‌ప్రీత్ బుమ్రా, షమీ, అర్ష్‌దీప్ సింగ్



## కోచ్‌గా కెప్టెన్ నిర్ణయాలపై నమ్మకం ఉంచుతాడు: రోహిత్

ఛాంపియన్స్ ట్రోఫీ కోసం భారత జట్టును ప్రకటించిన సమయంలో కెప్టెన్ రోహిత్ శర్మ, చీఫ్ సెలక్టర్ పలు విషయాలపై స్పందించారు. స్క్వాడ్‌లోకి కొందరికి అవకాశం దక్కకపోవడానికి కారణాలను వెల్లడించారు. దేశవాళీలో నాణ్యమైన క్రికెట్ ఆడినప్పటికీ కరుణ్ నాయర్‌కు అవకాశం ఇవ్వలేకపోయామని.. శుభ్‌మన్ గిల్ వైస్ కెప్టెన్సీని సమర్థంగా నిర్వర్తించగలడనే నమ్మకం ఉందని వెల్లడించారు. కోచ్‌తో తనకు మనస్పర్థలు వచ్చినట్లు ఇటీవల సోషల్ మీడియాలో సాగుతోన్న ప్రచారాన్ని రోహిత్ తోసిపుచ్చాడు. గంభీర్‌తో తన సంబంధంపై వివరణ ఇచ్చాడు. సీనియర్ ఆటగాళ్లు దేశవాళీలో ఆడే అంశంపైనా స్పందించాడు. 'గత ఆరేడేళ్లుగా జాతీయ జట్టుకు ఆడే ప్లేయర్లకు దేశవాళీలో పాల్గొనేంత సమయం లేదు. ఏడాది పొడవునా అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడుతున్నప్పుడు.. కచ్చితంగా బ్రేక్ కావాలి. ఇలాంటప్పుడు డొమెస్టిక్ క్రికెట్ ఆడటం చాలా కష్టం. ఆ మ్యాచ్‌లు ఆడకుండా కావాలని తప్పించుకోవడానికి ఎవరూ ప్రయత్నించరు. ఈసారి నేను ముంబయి జట్టుకు ఆడుతున్నా. జమ్ముకశ్మీర్‌తో మ్యాచ్ ఆడేందుకు రెడీ అవుతున్నా. ఛాంపియన్స్ ట్రోఫీ కోసం ప్రకటించిన జట్టులో సిరాజ్‌ను కాకుండా అర్ష్‌దీప్ సింగ్‌కు అవకాశం ఇచ్చాం. బుమ్రా ఫిట్‌నెస్ ఎలా ఉందనేది ఇంకా తెలియని పరిస్థితి. అతడు అందుబాటులో ఉన్నా లేకున్నా అర్ష్‌దీప్ జట్టులో ఉంటే వికెట్‌కు రెండువైపులా బౌలింగ్ చేయగలడు.



# జిల్లాల్లో క్రికెట్ అభివృద్ధికి బీసీసీఐ భరోసా

- నూతన కార్యదర్శి దేవజిత్‌తో హెచ్‌సీఏ అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్ రావు భేటీ
- కొత్త స్టేడియాల నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పనకు బోర్డు నుంచి 50 శాతం నిధులు
- వచ్చే ఐపీఎల్‌లో హైదరాబాద్‌కు ఎక్కువ మ్యాచ్‌లు కేటాయిస్తామని హామీ

**ముంబై:** గ్రామీణ తెలంగాణలో క్రికెట్ అభివృద్ధికి బీసీసీఐ సహకరించాలని బోర్డు నూతన కార్యదర్శి దేవజిత్ సైకియాను హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్ రావు కోరారు. శనివారం ముంబైలోని బీసీసీఐ కార్యాలయంలో దేవజిత్, సీఈఓ హేమంగ్ అమిన్‌తో జగన్‌మోహన్ రావు, హెచ్‌సీఏ కోశాధికారి సీజే శ్రీనివాస్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జరిగిన చర్చల్లో జిల్లాల్లో కొత్తగా నిర్మించే స్టేడియాలు, మౌలిక సదుపాయాల కల్పనకు బోర్డును తోడ్పాటు కావాలని జగన్‌మోహన్ రావు కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన దేవ్‌జిత్ జిల్లాల్లో హెచ్‌సీఏ చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు బోర్డు నుంచి 50శాతం నిధులు అందిస్తామని భరోసా ఇచ్చారు. తెలంగాణలో క్రికెట్‌కు ఉన్న ఆదరణ దృష్ట్యా వచ్చే ఐపీఎల్‌లో హైదరాబాద్‌కు ఎక్కువ మ్యాచ్‌లు కేటాయించాలని జగన్‌మోహన్ రావు కోరగా, లీగ్ మ్యాచ్‌లతో పాటు నాకౌట్ పోటీలు నిర్వహించే అవకాశమిస్తామని దేవ్‌జిత్ హామీ ఇచ్చారు. భవిష్యత్‌లో జరిగే ముఖ్యమైన ఐసీసీ టోర్నీల్లో టీమిండియా మేనేజర్‌గా హెచ్‌సీఏ నుంచి ఒకరికి అవకాశమివ్వాలని కోరగా సానుకూలంగా స్పందించారు. రాష్ట్రంలో క్రికెట్ అభివృద్ధికి బీసీసీఐ కట్టుబడి ఉందని, బోర్డు ముందు పెట్టిన ప్రతిపాదనలు త్వరలో కార్యరూపం దాల్చనున్నాయని జగన్‌మోహన్ రావు చెప్పారు.



## ధోనీ స్థాయికి పంత్ చేరువగా వచ్చాడు
### మహ్మద్ కైఫ్

**న్యూఢిల్లీ:** భారత క్రికెట్‌లో ఎంఎస్ ధోనీకి ప్రత్యేకమైన స్థానం ఉంది. టీమ్‌ఇండియాకు రెండు వరల్డ్ కప్‌లు అందించిన ఏకైక సారథి. వికెట్ కీపర్ కమ్ బ్యాటర్‌గా భారత విజయాల్లో ఆయన కీలకపాత్ర పోషించాడు. అతడి తర్వాత రిషభ్ పంత్ ఆ స్థాయికి చేరుకుంటాడనేది క్రికెట్ విశ్లేషకుల అంచనా. అయితే, ఇటీవల అతని ఫామ్ కాస్త కలవరానికి గురిచేస్తున్నప్ప టికీ.. ధోనీ స్థాయికి పంత్ చేరువగానే వచ్చాడని భారత మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్ వ్యాఖ్యానించాడు. టీమ్‌ఇండియా కి కీలకమైన బ్యాటర్‌గా ఎదిగాడని పేర్కొన్నాడు. అయితే, పరిమిత ఓవర్ల క్రికెట్‌లో ఇంకాస్త నిలకడ ప్రదర్శించాలని సూచించాడు. అతడికి పోటీగా సంజు శాంసన్ ముందుకొచ్చాడని తెలిపాడు. టీ20ల్లో సంజు అద్భుతమైన ప్రదర్శన చేస్తున్నాడని కైఫ్ ప్రశంసించాడు. "సంజు శాంసన్ ఇటీవల మంచి ఆటతీ రును ప్రదర్శిస్తున్నాడు. రిషభ్ పంత్‌తో అభిమానులు ఎమోషనల్‌గా కనెక్ట్ అయ్యారు. టెస్టుల్లో అతడు మ్యాచ్ విన్నర్. దక్షిణాఫ్రికా, ఆసీస్ పర్యటనల్లో పంత్ ఇన్నింగ్స్‌లను ఎవరూ మరిచిపోలేరు. మంచి వికెట్ కీపర్. సంజు కంటే పంత్ అత్యుత్తమం. ఈవిషయంలో ధోనీ స్థాయికి పంత్ చేరువగా వచ్చాడు. అయితే, పరిమిత ఓవర్ల క్రికెట్‌లో నిలకడ అత్యంత అవసరం. పరిస్థితేంటో ఓ అంచనాకు రావాలి. సంజుతో పోలిస్తే పంత్ గణాంకాలు మెరుగ్గా లేవు. అతడికి 'నువ్వు పొరపాట్లు చేస్తున్నావు' అని చెప్పేవారు సరైన విషయాలు ఏంటో చెప్పడం లేదు. అలాంటి ఫ్రెండ్స్‌ను పంత్ దూరం పెట్టాలి. పరిమిత ఓవర్ల క్రికెట్ గణాంకాలు మంచిగా లేవని చెప్పాల్సిన అవసరం ఉంది. అందుకే, పంత్ కంటే సంజు శాంసన్‌కు ఎక్కువ అవకాశాలు ఇవ్వాలనే డిమాండ్లూ వస్తున్నాయి. పంత్ ఇంకాస్త అదనంగా శ్రమించాల్సిందే" అని కైఫ్ వెల్లడించాడు. 'సంజు శాంసన్ 2015లో హరారే వేదికగా టీ20ల్లోకి అరంగేట్రం చేశాడు. కానీ, అతడు 2020లో రెండో మ్యాచ్ ఆడాడు. ఇన్నింగ్స్‌ను ప్రారంభించినా.. మిడిల్ ఆర్డర్‌లో వచ్చినా పరుగులు చేయడమే అతడి లక్ష్యంగా సాగింది.

# జట్టులోకి మళ్లీ వస్తా : కరుణ్ నాయర్



**వడోదర:** భారత జట్టులోకి పునరాగమనంపై ఎన్నో ఆశలతో ఉన్నట్లు సీనియర్ క్రికెట్ కరుణ్ నాయర్ వెల్లడించాడు. ఇటీవల విజయ్ హజారే ట్రోఫీలో వరుసగా సెంచరీల మోత మోగించిన కరుణ్ నాయర్‌ను ఎంపిక చేయాలని ఇప్పటికే పలువురు మాజీలు సూచించారు. ఛాంపియన్స్ ట్రోఫీ కోసం టీమ్‌ను ఇంకా ప్రకటించాల్సి ఉంది. వన్డే ఫార్మాట్‌లో జరిగిన విజయ్ హజారే ట్రోఫీలోనే కరుణ్ దూకుడుగా ఆడాడు. మరోవైపు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్నారు. ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌కు కూడా జట్టును ఇంకా వెలువరించలేదు. ఈ క్రమంలో తాను మళ్లీ జాతీయ జట్టులోకి వస్తానని కరుణ్ నాయర్ నమ్మకంగా చెప్పాడు. విజయ్ హజారే ట్రోఫీలో ఏడు మ్యాచుల్లో 750కిపైగా పరుగులు చేశాడు. "దేశం కోసం ఆడాలనేదే నా కల. ఇప్పటికే నేను దానిని సాధించా. కానీ, ఆ కల ఇప్పటికీ సజీవంగానే ఉంది. అందుకే, నేను ఇంకా క్రికెట్ ఆడుతున్నాననిపిస్తోంది. ఒకవేళ నేను ఇప్పుడు ఎంపికైతే ఇది నా మూడో పునరాగమనం అనుకుంటా. ఆ అవకాశం కోసం నిరంతరం శ్రమిస్తూనే ఉన్నా. నేనెప్పుడు క్రీజ్‌లోకి వెళ్లినా ఇదే నా చివరి ఛాన్స్ అనుకొని ఆడతా. ఒక్కో మ్యాచ్‌లో మెరుగైన ప్రదర్శన చేసుకుంటూ ముందుకు సాగా. నాణ్యమైన క్రికెట్ ఆడటం వరకే నా చేతుల్లో ఉంటుంది. మిగతావన్నీ మన నియంత్రణలో లేనివి. ఇప్పటికీ నేను సెలక్ట్ అవుతాననే నమ్మకం ఉంది. గతంతో పోలిస్తే నేనేమీ విభిన్నంగా ప్రయత్నించలేదు. ఇందులో ఎలాంటి రహస్యం లేదు. సంవత్సరాలుగా చేస్తోన్న తీవ్ర కృషికి ఇప్పుడు ఫలితం వచ్చినట్లు అనిపిస్తోంది. ప్రతిరోజు కొత్త సవాల్‌గా భావించా. ఇప్పుడు అవకాశం వస్తుందో లేదోనని భయపడటం లేదని చెబితే అది అబద్ధమే అవుతుంది. ప్రతి ఒక్కరికీ ఈ ఫీలింగ్ కలుగుతుంది. కానీ, రాకపోయినా నా కెరీర్ ఏమీ ముగిసిందని భావించను. ఏం జరిగిందనేది కాస్త ఆలోచిస్తా. ఆ తర్వాత మళ్లీ నేనేం చేయాలనే దానిపై దృష్టిసారిస్తా. సున్నా నుంచే మొదలు పెట్టాలని.. మరికొన్నేళ్లు కష్టపడాలని అనుకుంటా. ఇదే నా ఆలోచనా విధానం. వస్తే మాత్రం ఈసారి ఎట్టిపరిస్థితుల్లోనూ ఛాన్స్‌ను వదులుకోను" అని కరుణ్ నాయర్ వెల్లడించాడు.

# ఎంపీ ప్రియ సరోజ్‌తో రింకు పెళ్లి?





**న్యూఢిల్లీ:** భారత క్రికెటర్ రింకు సింగ్ త్వరలోనే పెళ్లి పీటలు ఎక్కబోదు తున్నాడు. ఎస్పీ ఎంపీ ప్రియా సరోజ్‌ను మనువాడను న్నాడు. ఈ విషయాన్ని ప్రియా తండ్రి, యూపీలోని కెరకట్ అ సెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే అయిన తుఫానీ సరోజ్ ధ్రువీకరించారు. పెళ్లి విషయంపై అలీఘఢ్‌లో రింకు తండ్రితో చర్చించినట్లు ఆయన వివరించారు. పార్లమెంట్ సమావేశాల తర్వాత నిశ్చితార్థం, వివాహ తేదీలను నిర్ణయించనున్నట్లు పేర్కొన్నారు. నిశ్చితార్థం లక్నోలో జరుగుతుందని పేర్కొన్నారు. జౌన్‌పూర్‌లోని మచ్లిషహర్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి సమాజ్‌వాదీ పార్టీ టికెట్‌పై ప్రియా సరోజ్ గెలుపొందారు. అయితే, రింకు సింగ్, ప్రియా నిశ్చితార్థం జరిగినట్లు వచ్చిన వార్తలు తుఫానీ సరోజ్ కొట్టిపడేశారు. సోషల్ మీడియాలో వస్తున్న వార్తల్లో నిజం లేదని తెలిపారు. ఇంకా ఇద్దరి నిశ్చితార్థం జరుగలేదని చెప్పారు. గత గురువారం రింకు కుటుంబాన్ని అలీగఢ్‌లో కలిసినట్లు పేర్కొన్నారు. వివాహం విషయంలో చర్చలు అర్థవంతంగా జరిగాయన్నారు. పార్లమెంట్ సమావేశాల జనవరి నెలాఖరు నుంచి ప్రారంభమై ఫిబ్రవరి 13 వరకు కొనసాగుతాయన్నారు. ఈ సమావేశాలు ముగిసిన తర్వాత నిశ్చితార్థం, వివాహ తేదీలను నిర్ణయించున్నట్లు తెలిపారు. ఇక రింకు సింగ్ ఇంగ్లాండ్‌తో టీ20 సిరీస్‌లో పాల్గొననున్నాడు. ఆ తర్వాత ఐపీఎల్ జరుగబోతుంది. ఐపీఎల్‌లో కేకేఆర్ తరఫున బరిలోకి దిగనున్నాడు. రూ.13కోట్లకు రింకు సింగ్‌ను కేకేఆర్ కొనుగోలు చేసింది. ఈ క్రమంలో ఎంగేజ్‌మెంట్, వివాహ తేదీల విషయంలో రింకు పెళ్లి తేదీలను జాగ్రత్తగా చూడాల్సి ఉందని.. పెళ్లితో ఆటకు ప్రభావితం కాకుండా చూసుకోవాల్సి ఉంటుందన్నారు. ప్రియా సరోజ్ స్నేహితురాలి తండ్రి క్రికెటర్ అని తుఫానీ సరోజ్ తెలిపారు. ఆయన ద్వారా రింకు, ప్రియా ఇద్దరూ కలిశారన్నారు. ఇద్దరూ ఇరుకుటుంబాల అనుమతి పెళ్లి చేసుకుంటామని చెప్పారని.. ఈ క్రమంలోనే రింకు కుటుంబంతో చర్చలు జరిపామన్నారు.

# రోహిత్ - విరాట్.. బోత్ ఆర్ నాట్ సేమ్ : భారత మాజీ క్రికెటర్



**ముంబై:** రోహిత్ శర్మ నాయకత్వంలోనే వన్డే ప్రపంచకప్ ఫైనల్‌కు భారత్ వెళ్లింది. గత టీ20 ప్రపంచ కప్‌ను టీమ్‌ఇండియా సొంతం చేసుకుంది. కానీ, వరుసగా న్యూజిలాండ్, ఆస్ట్రేలి యాతో టెస్టు సిరీస్‌లను కోల్పోవడంతో అతడిపై తీవ్రస్థాయిలో విమర్శలు రేగాయి. కెప్టెన్‌గానే కాకుండా.. వ్యక్తిగతంగానూ దారుణంగా విఫలం కావడం అభిమానులను నిరాశకు గురిచేసింది. మరోవైపు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ పరిస్థితి ఇందుకు భిన్నంగా ఏమీ లేదు. ఆసీస్‌పై మంచి రికార్డు ఉన్న అతడు.. ఇటీవల ముగిసిన బోర్డర్-గావస్కర్ ట్రోఫీలో మాత్రం తన స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేదు. వీరిద్దరి టెస్టు భవిష్యత్తు సందిగ్ధంలో పడింది. ఈక్రమంలో భారత మాజీ క్రికెటర్ దీప్‌దాస్ గుప్తా స్పందిస్తూ.. రోహిత్‌కు రాబోయే ఐదు నెలలు అత్యంత కీలకమని వ్యాఖ్యానించాడు. రోహిత్‌తో విరాట్‌ను పోల్చడం సరైంది కాదని వ్యాఖ్యానించాడు. "ఎప్పుడూ ఒక తరానికి చెందిన ఇద్దరు క్రికెటర్లను పోల్చకూడదు. రోహిత్, విరాట్‌ను కలిపి విశ్లేషించకూడదు. గతతరం దిగ్గజ క్రికెటర్లు సచిన్, రాహుల్ ద్రవిడ్ విభిన్నమైన ప్లేయర్లు. అందుకే, ప్రతి ఆటగాడిని వ్యక్తిగతంగానే విశ్లేషించాలి. రోహిత్‌కు వచ్చే ఐదు నెలలు అత్యంత కీలకం. పరిమిత ఓవర్ల క్రికెట్ ఎక్కువగా ఆడతాడు. ఐపీఎల్ కూడా ఉంది. దేశవాళీలోనూ ఆడితే మాత్రం ఫామ్‌ను అందుకోవచ్చు. ఫిట్‌నెస్‌తోపాటు ఛాంపియన్స్ ట్రోఫీలో నిలకడైన ప్రదర్శనే కీలక అంశాలుగా మారతాయి. అప్పుడే టెస్టు సిరీస్‌కు అతడిని ఎంపిక చేయాలా? వద్దా? అని సెలక్టర్లు ఓ నిర్ణయానికొస్తారు. విరాట్ కోహ్లీ బలహీనతతో ఇబ్బందిపడుతున్నాడు. దానిని అధిగమిస్తే అతడికి తిరుగుండదు. ఫిట్‌నెస్ విషయంలో కోహ్లీ అందరికంటే మెరుగ్గా ఉంటాడని తెలిసిందే" అని దీప్‌దాస్ గుప్తా వెల్లడించాడు.

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

8 ఆదివారం 19 జనవరి 2025


## జేసీ ప్రభాకర్‌రెడ్డిపై మాధవిలత ఫిర్యాదు



సినిమా రంగంలో ఉన్న మహిళలపై అనుచితంగా మాట్లాడిన టీడీపీ నాయకుడు జేసీ ప్రభాకర్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని సినీ నటి మాధవి లత కోరారు. ఈ మేరకు శనివారం 'మా' అసోసియేషన్ ట్రెజరర్ శివ బాలాజీకి ఫిర్యాదును అందజేశారు. సినీరంగంలోని మహిళలపై జరుగుతున్న వ్యక్తిత్వ హననం చేస్తూ సినిమా వారిపై ఆరోపణలు చేయడం కరెక్టు కాదంటూ పేర్కొన్నారు. జేసీ ప్రభాకర్‌రెడ్డిపై ఫిల్మ్ ఛాంబర్‌తో పాటు మానవహక్కుల సంఘానికి, పోలీసులకు, ఫిల్మ్ ఇండస్ట్రీకి ఫిర్యాదు చేశాను. ఎవరూ స్పందించలేదు. అందుకే 'మా' కు ఫిర్యాదు చేశానని పేర్కొన్నారు. న్యాయం కోసం పోరాడుతానంటూ ఎక్స్‌లో పోస్టు చేశారు.



## ఒంటరిగా వస్తా..


### మాట్లాడుకుందాం : మంచు మనోజ్

మంచు ఫ్యామిలీలో గత కొన్ని రోజులుగా ఆస్తుల విషయం లో గొడవలు జరుగుతున్న విషయం తెలిసిందే. సంక్రాం తి సమయంలోనూ మరోసారి కుటుంబ వివాదాలు బయట పడ్డాయి. అయితే ఈ ఘటన కు సంబంధించి ఇద్దరిపై కేసులు కూడా నమోద య్యాయి. ఇదిలావుంటే నిన్న టి నుంచి మంచు విష్ణు, మంచు మనోజ్‌లు ఎక్స్ (ట్విట్టర్) వేదికగా పరస్పర విమర్శలు గుప్పించుకుం టున్నారు. ఇప్పటికే విష్ణు, మనోజ్‌లు సింహం, కుక్క రిఫరెన్స్‌లు వాడగా.. ఇవి ట్విట్టర్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. అయితే తాజాగా మంచు మనోజ్ పెట్టిన కూర్చొని మాట్లాడుకుందాం అనే పోస్ట్ ఒకటి ప్రస్తుతం వైరల్‌గా మారింది. నువ్వు చాలా క్యూట్. మనం కలిసి కూర్చొని మాట్లాడుకుందాం. నాన్న, ఇంట్లోని మహిళలు, ఉ ద్యోగులు మిగిలిన వాళ్లను పక్కనపెట్టి మనమే చర్చించుకుందాం. ఏం అంటావు.? ఈ మీటింగ్‌కి నేను ఒంటరిగానే వస్తాను అని మాటిస్తున్న. నీకు నచ్చిన వాళ్లను నువ్వు తీసుకురావచ్చు. లేదా మనం మంచి హెల్తీ డిబేట్ పెట్టుకుందాం. నీ కరెంట్‌తీగ అంటూ మనోజ్ రాసుకోచ్చాడు. అయితే ఈ పోస్ట్‌కి ఎవరిని ట్యాగ్ చేయలేదు మనోజ్. కానీ ఇది విష్ణుని ఉద్దేశించి మాత్రమే మనోజ్ పెట్టినట్లు నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. కాగా దీనిపై విష్ణు ఏం అంటాడో చూడాలి.

## నటనా ప్రావీణ్యుడు ఎన్టీఆర్ : బాలకృష్ణ



నటనలో ప్రయోగాలు చేసిన నటనా ప్రావీణ్యుడు ఎన్టీఆర్ అని సీనియర్ హీరో, హిందూపూర్ ఎమ్మెల్యే బాలకృష్ణ అన్నారు. తెలుగునాట నందమూరి తారక రామారావు విప్లవాన్ని తీసుకొచ్చారని వెల్లడించారు. కష్టజీవుల కన్నీళ్లు, అన్నార్తుల ఆకలి నుంచి టీడీపీ పుట్టిందని చెప్పారు. ఏపీ మాజీ ముఖ్య మంత్రి, టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీ రామారావు 29వ వర్ధంతి సందర్భంగా ఎన్టీఆర్ ఘాట్‌లో సోదరుడు రామకృష్ణతో కలిసి బాలకృష్ణ నిరవాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. పేదలకు ఉపయోగపడే పథకాలను ఎన్టీఆర్ ప్రవేశపెట్టార న్నారు. ఎన్టీఆర్ అంటే నటనకు నిర్వచనమని, నవరసాలకు అలంకారమని చెప్పారు. ఎన్టీఆర్ అంటే ఒక వర్సిటీ అని, జాతికి మార్గదర్శకమన్నారు. అలాంటి మహనీయులకు మర ణం ఎప్పటికీ ఉండదని తెలిపారు. తెలుగువారి ఆత్మ గౌరవం కోసం టీడీపీని ఎన్టీఆర్ స్థాపించారని రామకృష్ణ చెప్పారు. తొమ్మిది నెలల్లోనే తెలుగు ప్రజలు ఆయనను ముఖ్యమంత్రిని చేశారని వెల్లడించారు. ప్రాంతాలు వేరైనా తెలుగు వారంతా ఒకటే నని ఎన్టీఆర్ చారని తెలిపారు. ఎన్టీఆర్ వర్ధంతి సంద ర్భంగా ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఎక్స్ వేదికగా నివాళి అర్పించారు. 'సమాజమే దేవాలయం.. ప్రజలే దేవుళ్లు' అన్న సూక్తిని మొదటిసారిగా రాజకీయాలకు పరిచయం చేసిన మానవతావాది.. నిరుపేదల జీవితాల్లో సంక్షేమ వెలుగులు నింపిన మహనీయుడు ఎన్టీఆర్. బడుగు బలహీన వర్గాల వారికి రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పించిన సమతావా ది.. స్త్రీలకు సాధికారతనిచ్చిన సంస్కర్త.. స్వర్గీయ నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా ఆ మహానాయకుని స్మృతికి నివాళులర్పిద్దాం. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన తో.. "అధికారం అంటే పేదల జీవితాలు మార్చేందుకు వచ్చిన అవకాశం" అని నిరూపించిన మాననీయులు ఎన్టీఆర్. తెలుగు జాతిని నెంబర్ వన్ చేసేందుకు కంకణబద్ధులై ఉన్నామని తెలుపుతూ.. ఆ యుగపురుషుని వర్ధంతి సందర్భంగా నివాళు లు అర్పిస్తున్నాను అంటూ సీఎం చంద్రబాబు ట్వీట్ చేశారు.



### సీనియర్ ఎన్టీఆర్‌కు నివాళులర్పించిన జూనియర్ ఎన్టీఆర్, కల్యాణ్‌రామ్

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం, టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా జూనియర్ ఎన్టీఆర్, కల్యాణ్ రామ్ నివాళులు అర్పించారు. శనివారం ఉదయం అన్న కల్యాణ్ రామ్‌తో కలిసి హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ ఎన్టీఆర్ ఘాట్‌కు చేరుకున్న ఎన్టీఆర్.. తాత సమాధి వద్ద పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో వారి అభిమానులు ఎన్టీఆర్ ఘాట్‌కు తరలివచ్చారు. కాగా, ఎన్టీఆర్ సతీమణి లక్ష్మీ పార్వతి కూడా ఎన్టీఆర్ ఘాట్ వద్ద ఆయనకు నివాళులర్పించారు. ఇక, సీనియర్ హీరో, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, ఏపీ మంత్రి నారా లోకేశ్ తదితరులు ఎన్టీఆర్ ఘాట్ వద్ద నివాళి అర్పించానున్నారు. అదేవిధంగా ఎన్టీఆర్ ట్రస్టు భవన్‌లో మెగా రక్తదాన శిబిరం నిర్వహిం చనున్నారు.



## క్షమించండి సార్..

### సైఫ్ అలీఖాన్‌కు క్షమాపణలు చెప్పిన నటి ఊర్వశీ రౌతేలా

బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌కి క్షమాపణలు తెలిపింది నటి ఊర్వశీ రౌతేలా. నేను మీ గురించి ఇలా మాట్లాడినందుకు సిగ్గుపడుతున్నాను అంటూ సోషల్ మీడియాలో ఒక పోస్ట్ పెట్టింది. సైఫ్ అలీఖాన్ మీద దుండగులు దాడి జరిపిన విషయం తెలిసిందే. గత గురువారం తెల్లవారుజామున ముంబై బాంద్రాలోని ఆయన నివాసంలోకి చొరబడిన దుండగుడు కత్తితో సైఫ్‌పై దాడి చేశాడు. దీంతో ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు సైఫ్. అయితే సైఫ్ ఘటనపై బాలీవుడ్ సినీ ప్రముఖులతో పాటు రాజకీయ నాయకులు స్పందిస్తున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నారు. అయితే ఈ విషయంపై నటి ఊర్వశీ రౌతేలా మీడియాతో స్పందిస్తూ.. సైఫ్‌పై దాడి దురదృష్టకరం. నేను ప్రస్తుతం డాకు మహారాజ్ సక్సెస్ మూడ్‌లో ఉన్నాను. ఇప్పటి వరకు రూ.105కోట్లు వసూళ్లు సాధించింది. ఈ సినిమా సక్సెస్ అయినందుకు మా అమ్మ నాకు డైమండ్ రింగ్ గిఫ్ట్‌గా ఇచ్చింది. మా నాన్న రోలెక్స్ వాచ్ గిఫ్ట్‌గా ఇచ్చాడు. అయితే వీటిని ధరించాలంటే ఎవరైన దాడి చేస్తారేమో అని ఇప్పుడు భయమేస్తుంది. అంటూ చెప్పుకోచ్చింది. అయితే రింగ్ ఇచ్చిందంటూ మీడియాకి చూపించడం.. అలాగే ఈ వ్యాఖ్యలు తీవ్ర వివాదానికి దారి తీశాయి. సైఫ్ అలీఖాన్ చావు బతుకుల మధ్య ఉంటే నువ్వు ఏం మాట్లాడుతున్నావు అంటూ ఊర్వశీపై నెటిజన్లు దుమ్మెత్తిపోశారు. దీంతో తాజాగా ఈ విషయంపై ఊర్వశీ సైఫ్‌కు క్షమాపణలు తెలిపింది. సైఫ్ సర్ ఈ సందేశం మీకు అందుతుందని ఆశిస్తున్న. మీ గురించి మాట్లాడే క్రమంలో నేను ప్రవర్తించిన తీరుపై నాకు సిగ్గుగా ఉంది. ఈ విషయంలో మీకు క్షమాపణలు తెలుపుతున్నా. ఇంటర్వ్యూ ఇచ్చే టైంలో మీపై జరిగిన దాడి ఎంత సీరియస్ అనేది నాకు పూర్తిగా తెలియదు. నేను ఒక సినిమా సక్సెస్‌లో మూడ్‌లో ఉండి.. ఆ సినిమాకి వచ్చిన గిఫ్ట్‌ల గురించి మాట్లాడాను ఈ విషయంలో సిగ్గుపడుతున్నా అంటూ ఉర్వశీ రాసుకోచ్చింది.

## థమన్ వ్యాఖ్యలపై స్పందించిన చిరంజీవి



బాలకృష్ణ డాకు మహరాజ్ సక్సెస్ ఈవెంట్‌లో సంగీత దర్శకుడు ఎస్ ఎస్ థమన్ తెలుగు సినిమా గురించి మాట్లాడుతూ.. ఎమోషనల్ అయ్యాడు. విజయం అనేది ఎంత డబ్బు పెట్టిన దొరకదు. అది వచ్చినప్పుడు ఇచ్చే ఎనర్జీ వేరు. మనం లైఫ్‌లో చాలా ముందుకు పోవడానికి సక్సెస్ చాలా ఉపయోగపడు తుంది. సక్సెస్ లేకపోతే నేను ఫిలిం నగర్‌కి కూడా వెళ్లేవాడిని కాదు. అయితే ఒక సక్సెస్ వచ్చిందని చెప్పడానికి కూడా ఇప్పుడు నిర్మాతలకు చెప్పబుద్ధి కావడం లేదు. అలా చేబితే అతడిపై నెగిటివ్‌గా ట్రోల్ చేయడం.. నెగిటివ్‌గా ట్రెండ్ చేయడం జరుగుతుంది. మీరు చేసే నెగిటివ్ ట్రోల్స్ చేయడం వలన నిర్మాతల జీవితాలు ఎఫెక్ట్ పడుతున్నాయి. నేను ఎందుకు చెబుతున్నాను అంటే ఈరోజు ప్రపంచం మొత్తం తెలు గు సినిమాను చాలా గర్వంగా చూ స్తుంది. తెలుగు సినిమా ఇప్పుడు ఒక వెలుగు వెలుగుతుంది. ఇప్పుడు ఏ సినిమా ఇండస్ట్రీకి వెళ్లిన తెలుగులో ఒక సినిమా చేయాలి అని అడుగు తున్నారు. మనమే మన సినిమాని చంపేసుకుంటుంటే ఏం బ్రతు కు బ్రతుకుతున్నాం అనే ది అర్థం కావాట్లేదు.



## 'పద్మావత్' ఆఫర్ నాకే వచ్చింది..

### అందుకే తిరస్కరించా : కంగనా రనౌత్

నటి కంగనా రనౌత్, దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ మధ్య పచ్చ గడ్డి వేస్తే భగ్గుమంటుందని బాలీవుడ్ మొత్తం తెలుసు. గత కొన్నేళ్లుగా అనేక వేదికలపై ఒకరి పేరును మరొకరు ప్రస్తావించకుండానే విమర్శలు చేసుకున్నారు. తాజాగా కంగనా రనౌత్ మరోసారి తన మాటలకు పదును పెట్టారు. సంజయ్ ఇచ్చిన ఎన్నో ఆఫర్లను తాను వద్దని చెప్పానని తాజాగా చెప్పుకొచ్చారు. ముఖ్యంగా 'పద్మావత్'లో టైటిల్ రోల్ ఆఫర్ చేసినా తిరస్కరించానని అన్నారు. ఆ తర్వాత అందులో దీపిక పదుకొణె నటించి మంచి పేరు తెచ్చుకున్న సంగతి తెలిసిందే. కంగనా రనౌత్ స్వీయ దర్శకత్వంలో రూపొందిన 'ఎమర్జన్సీ' ప్రచారంలో భాగంగా ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడారు. ముఖ్యంగా హిందీ సినిమా దర్శకులు మహిళలను వెండితెరపై చూపించే విషయంలో తాను ఎంతో నిరుత్సాహంగా ఉ న్నట్లు తెలిపారు. "ఒక నటిగా నేను అత్యున్నత స్థాయికి చేరాలనుకున్నా. ఫేక్ ఐల్యాష్, బొటాక్స్ (వృద్ధాప్య ఛాయలు కనిపించకుండా తీసుకునే చికిత్స) నాకవి సరిపడవు. నేను వాటి సాయంతో అందంగా కనిపించాలనుకునే హీరోయిన్‌ను కాదు. ఈ ఆలోచనాధోరణి క్రమంగా నాలో పెరుగుతూ వచ్చింది. 'తను వెడ్స్ మను', 'క్వీన్' తర్వాత నిరుత్సాహ భావన నాలో మరింత పెరిగిపోయింది. ఇండస్ట్రీలో ఉన్న టాప్-5 దర్శకులు.. వాళ్ల సినిమాల్లో హీరోయిన్ పాత్రలను చూపించే తీరు మీరు చూడండి. గట్టిగా ఐదారు నిమిషాలు కూడా అవకాశమివ్వరు. ఖాన్ త్రయం సినిమాలతో సహా, పెద్ద సినిమాల నుంచి నాకు ఆఫర్లు వచ్చాయి. కానీ, అందులో నేను కనిపించేది 10-15 నిమిషాలే. పైగా తక్కువ చేసి చూపిస్తారు. ఒక మహిళను సదుద్దేశంతో చూపించాలన్న ఆలోచన కూడా ఉండదు" అని కంగనా అసహనం వ్యక్తం చేశారు.


Printed, Published and Owned by **Adula Thirupathi,** Printed at Ramani Web Offset Printers, H.No 8-82/11/1, Auto Nagar, Bommakal Road, Village, mdl & Dist : Karimnagar 505001,Telangana State, Published from 2-5-23, Mudhiraj street,Vemulawada Town, mandal, Siricilla Dist, (Karimnagar Dist) 505302,Telangana State. **Editor: Adula Thirupathi.** Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277. RNI NO : **TELTEL/2023/87657**